# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 203 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజిలు : 8 | వెల రూ. 2 | శుక్రవారం -23 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana




## జయసాయి రెడ్డి ఇంటికి వైఎస్ షర్మిల.. రాజకీయ వర్గాల్లో ఆసక్తి

- తన కుమార్తె వివాహానికి హాజరు కావాలని ఆహ్వానం
- జగన్‌తో విభేదించిన ఇద్దరు నేతల భేటీతో మొదలైన చర్చ
- భవిష్యత్తులో ఇద్దరూ కలిసి పనిచేస్తారనే ఊహాగానాలు

# వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కోనేందుకు కూటమి సిద్ధంగా ఉంది

## సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో హుటాహుటిన భేటీ

- కూటమిలో సీట్ల సర్దుబాటు, నామినేషన్లపై కీలక నిర్ణయాలు
- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వ్యూహంపై ఇరువురు నేతల చర్చ
- వైసీపీ ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ
- ప్రొటోకాల్ లేకుండా నేరుగా చంద్రబాబు నివాసానికి పవన్.. పరిషత్ పోరుపై కీలక మంతనాలు!



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం మిగతా 2 లో

## ఏపీలో మున్సిపల్ ఎన్నికలకు
# తాత్కాలిక బ్రేక్

తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని స్పష్టం




- రాష్ట్రవ్యాప్తంగా 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల తదుపరి ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, నామినేషన్ల దాఖలుకు అడ్డంకులు ఎదురయ్యాయన్న ఫిర్యాదులపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ

## మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్



నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు

మరో 30 ఏళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం దక్కదని జోస్యం

రాహుల్ విదేశీ పర్యటనలపై బీజేపీ నేతల వరుస ఆరోపణలు

జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా



## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ.. 6 గంటల్లోనే శ్రీవారి సర్వదర్శనం

తిరుమలలో గణనీయంగా తగ్గిన భక్తుల రద్దీ

ప్రస్తుతం 12 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు

సర్వదర్శనం 6 గంటల్లో పూర్తి



## తెలుగు రాష్ట్రాలకు మళ్లీ వర్షాలు..

### బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- ఏపీ, తెలంగాణలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం
- ఆంధ్రప్రదేశ్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల హెచ్చరిక
- తెలంగాణలో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు

# ఎంత వరకైనా పోరాడదాం

- వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ
- స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ
- చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ



అమరావతి: వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. మిగతా 2 లో

## కేటీఆర్ గడ్డం పెరుగుతుందేమో కానీ
# సీఎం మాత్రం కాలేరు

### అందుకే కేటీఆర్ గడ్డం పెంచుతున్నారట.. బీజేపీ ఎంపీ అర్వింద్ సెటైర్లు!

గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడంతోనే కేటీఆర్ అలా చేస్తున్నారని వ్యంగ్యాస్త్రాలు

గతంలో కేసీఆర్ పాత సచివాలయానికి వెళ్తే ఓడిపోతారని ఎవరో చెప్పడంతో కొత్త సచివాలయం నిర్మించారని వ్యాఖ్య

2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న అర్వింద్

రేవంత్‌రెడ్డిపై హైకమాండ్ అసంతృప్తిగా ఉందని వ్యాఖ్య



హైదరాబాద్: తెలంగాణలో బీజేపీ మౌనంగా ఉందన్న ప్రచారాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తోసిపుచ్చారు. మిగతా 2 లో



## హైదరాబాద్‌లో 'అలయ్ బలయ్'.. అట్టహాసంగా ప్రారంభమైన వేడుకలు

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ వేడుకలు
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం
- 'నషా ముక్త్ భారత్' థీమ్‌తో ఈ ఏడాది వేడుకల నిర్వహణ
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక ప్రదర్శనలు
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, గవర్నర్, సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నట్లు సమాచారం

# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

## పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

- సీఎం రేవంత్ కీలక ప్రకటన
- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ




హైదరాబాద్: బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని మిగతా 2 లో



## 12 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతుంది..

- ఇప్పటికీ మన ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించలేదు
- ఇది కాలం తెచ్చిన కరువు కాదని మేం గతంలో కూడా చాలాసార్లు చెప్పాం
- కరువు పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైపోయారు
- పత్తి లాంటి పంట కనీసం దిగుబడి కాదు.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు
- అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటికి, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక పండుగల సాయన్న

### -ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజు పుల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు లతో కలిసి పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పండుగల సాయన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: తెలంగాణ ఆత్మగౌరవ పోరాట యోధుడు, పేదల పెన్నిధి పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి సందర్భంగా పరిగి పట్టణంలో ఆయన విగ్రహానికి పరిగి ఎమ్మెల్యే,టీ పీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పండు గల్ల సాయన్న పేదలందరి నాయకుడని పేర్కొన్నారు.బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు.పేదల హక్కుల కోసం,సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.పండుగ సాయన్న ఆశయాలను స్మరించుకుంటూ, సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి (నస్కల్ ) దండు అశోక్, డిసిసి ఉపాధ్యక్షులు లాలు కృష్ణ , కౌన్సిలర్లు యూసుఫ్, కోఆప్షన్ సభ్యులు ఆనం ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పిఎసిఎస్ డైరెక్టర్ చిన్న నరసింహులు, నాయకులు నసిర్, యాదయ్య, రవి కాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

**వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలు వేయాలి**

**అప్పుడే రైతు ఆర్థికంగా నిల తొక్కుకోగలుగుతాడు**

**వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించినప్పుడే రైతులకు లాభం**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పరిగి మండల పరిధిలోని చిగురాల్ పల్లి రైతు వేదికలో 'ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణ ఏ డి ఏ అరుణ, ఎం ఏ ఓ రజిత పాల్గొని మాట్లాడుతూ.. నేల పరీక్షల నివేదికల ఆధారంగా రైతులు ఖచ్చితంగా సమతుల్య ఎరువుల మోతాదు లను మాత్రమే వాడాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా, ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు. క్షీణిస్తున్న నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మెరుగుపరచడానికి ప్రకృతి వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సాగు వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ సంతోష్ కుమార్ ఏ ఈ ఓ విజయ్ కుమార్ సర్పంచ్‌లు ఆయేషా బేగం,వెంకటమ్మ నాయకులు సలీం, సందీప్ రెడ్డి రైతులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించడమే లక్ష్యం

### - పరిగి ఎమ్మెల్యే ఈ రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు సహచర ఎమ్మెల్యేలు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ సాధించేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలు, ప్రచార సరళి, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ తదితర అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. ప్రతి



గ్రామం, పట్టణం, వార్డులో పట్టభద్రులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు క్షేత్రస్థాయి నుంచి సమష్టి కృషి అవసరమని ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు లాలు కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుజి వెంకట్ రాములు, పరిగి మండల పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజపుల్లారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి (నస్కల్ ) దండు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్నకు ఘనంగా నివాళులు అర్పించిన

### - అదనపు కలెక్టర్ వెంకటాచారి




వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు బి సి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆనాటి నిజాం ప్రభుత్వ హయాంలో భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు పండుగ సాయన్న అని ఆయన సేవలు కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పండుగ సాయన్న ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కె రంగా రాజ్, జయపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నర్సిములు, సంబంధిత అధికారులు బి .సి సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 'పారా' హుషార్ గెలుపు జీ హుజూర్!

విజయపథం

'ధనవంతులుగా పుట్టడం కంటే అదృష్టవంతులుగా పుట్టడం చాలా నయం' అనే ప్రసిద్ధ నానుడి ఉంది.

వీరు ధనవంతులు కాదు... అదృష్టవంతులు అంతకంటే కాదు.

'కష్టంతోనే అదృష్టం' అనే మాటను నిజం చేసిన క్రీడా యోధులు. స్ఫూర్తిప్రదాతలు.

వైకల్యం ఉన్న చోట సహాయం అందాలి. కనీసం సానుభూతి అయినా దక్కాలి.

అదేమిటో... వైకల్యం ఉన్నవారికి వెక్కిరింతలే ఎక్కువగా ఎదురవుతుంటాయి.

అలాంటి వెక్కిరింపుల వెన్ను విరిచి, ఆత్మస్థైర్యమే శ్వాసగా

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన మహిళలు వీరు.

ఆసియా పారా గేమ్స్‌లో విజయపతాకం ఎగరేసిన స్వర్ణ ధీరవనితలు వీరు...

'ఆ అమ్మాయిది మా ఊరే' 'మా పక్క ఊరే'... అని దీప్తి జీవాంజి గురించి ఇప్పుడు చాలామంది గర్వంగా చెబుతుంటారు. తాజాగా... జపాన్‌లోని నగోయాలో జరుగుతున్న ఆసియా పారా గేమ్స్‌లో మహిళల 400 మీటర్ల టీ 20 ఈవెంట్‌లో చరిత్ర సృష్టించి స్వర్ణం గెలుచుకుంది దీప్తి. రేసును 56.36 సెకన్లలో పూర్తి చేసి కొత్త రికార్డ్ సృష్టించింది. గతంలో తన పేరు మీద ఉన్న రికార్డ్‌ను (56.59 సెకనులు) తానే బ్రేక్ చేసింది.

### తన విజయాన్ని గురించి సంతోషిస్తూనే గతాన్ని గుర్తు తెచ్చుకుంది దీప్తి...

'ఒకప్పుడు నా వల్ల నా కుటుంబం అవమానాలు ఎదుర్కొంది. తిట్లు తిన్నది. నాకంటూ ఒక పేరు సంపాదించుకున్నప్పటి నుంచి అంతా మారిపోయింది. ఇప్పుడు మాతో అందరూ గౌరవంగా మాట్లాడుతున్నారు. ఇది నాకు మరింత వేగంగా పరుగెత్తేలా శక్తిని ఇస్తోంది'

### సూటిపోటి మాటలు

దీప్తి స్వగ్రామం తెలంగాణ రాష్ట్రంలోని కల్లెడ. ఆమె తల్లిదండ్రులు రోజువారీ కూలీలు. 'ఈరోజు గడిస్తే చాలు' అనుకునే పరిస్థితి. ఆర్థిక కష్టాల మాట ఎలా ఉన్నా, వారి బెంగ కూతురు దీప్తి గురించే. 'మీ అమ్మాయికి మానసిక లోపం. ఎలా బతుకుతుందో ఏమో! అసలు పెళ్లవుతుందా?'... ఇలాంటి సూటిపోటి మాటలెన్నో భరించారు.

### టర్నింగ్ పాయింట్

హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా శిక్షణా కేంద్రంలో చేరడం దీప్తి జీవితంలో టర్నింగ్ పాయింట్. అప్పుడు ఆమె తొమ్మిదో తరగతి చదువుతోంది. దీప్తి మాట్లాడేది అర్థం కాకపోవడంతో ఆమెకు కోచింగ్ ఇవ్వడం కష్టం అయింది. మెల్లగా నేర్చుకోవడం వల్ల ఎక్కువ విషయాలు చెప్పడానికి లేదు. ఎక్కువ




విషయాలు చెప్పడం వల్ల గందరగోళానికి గురయ్యేది. దీంతో చాలా జాగ్రత్తగా శిక్షణ ఇచ్చేవారు. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిసేబిటిటీ' కేంద్రానికి దీప్తిని తీసుకెళ్లమని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కోచ్ రమేష్‌కు సూచించారు. వైద్యపరీక్షల తరువాత దీప్తికి మానసిక వైకల్యం ఉన్నట్లు నిపుణులు ధ్రువీకరించారు. దీంతో ఆమె పారా మీట్స్‌లో పోటీ పడడానికి అనుమతి లభించింది. గోపీ--మైత్రా ఫౌండేషన్ ఆమెకు స్పాన్సర్‌గా వ్యవహరించింది. హాంగ్‌జౌ ఆసియా పారా గేమ్స్‌లో టీ 20 విభాగంలో 400 మీటర్ల పరుగులో స్వర్ణం గెలుచుకుంది. భువనేశ్వర్‌లో జరిగిన ఆల్--ఇండియా ఇంటర్--యూనివర్శిటీ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు సాధించింది...

### ఆమె స్వర్ణచరిత్ర మొదలైంది.

'రన్ దీప్తి రన్' పేరుతో ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ దీప్తిపై స్ఫూర్తిదాయకమైన పుస్తకం రాశారు.

### నా అంతిమ లక్ష్యం

నా కుటుంబం, నా దేశం కోసం రికార్డ్‌లు బద్దలు కొడుతూ వీలైనంత వేగంగా, వీలైనంత ఎక్కువ కాలం పరుగెత్తాలనుకుంటున్నాను. అయితే అంతకుమించిన లక్ష్యం ఒకటి ఉంది. ఎన్నో అడ్డంకులు, ప్రతికూలతలు ఉన్నప్పటికీ నాలాగే తమ కలలను సాకారం చేసుకోవడానికి ధైర్యం చేసే యువతులకు శిక్షణ ఇవ్వడమే నా అంతిమలక్ష్యం.

**-- దీప్తి జీవాంజి**

### జయనగర్ నుంచి జయపథం వరకు

జయనగర్‌లోని 'ఇండియన్ అథ్లెటిక్స్ అకాడమీ'లోకి అడుగు పెట్టినప్పుడు స్పైక్, ట్రాక్ టైమింగ్, స్ట్రైడ్ లెంగ్త్, ఆసియా పారా గేమ్స్ గురించి సౌమ్య కుమార్‌కు పెద్దగా అవగాహన లేదు. అయితే రెండేళ్ల వ్యవధిలోనే తానేమిటో నిరూపించుకుంది. కర్నాటకకు చెందిన సౌమ్య కుమార్ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్. ఆసియా పారా క్రీడల్లో అరంగేట్రం చేసిన సౌమ్య, దృష్టిలోపం ఉన్న మహిళల 1500 మీటర్ల టీ12/13 విభాగంలో స్వర్ణం గెలుచుకొని ప్రపంచదృష్టిని ఆకర్షించింది. 'ఆసియా పారా గేమ్స్‌లో స్వర్ణపతకాన్ని సాధించే ప్రయాణంలో వరుస విజయాలతో సత్తా చాటింది. సౌమ్య విజయాలకు కారణం...ఆటలపై ఆమెకు ఉన్న ప్రేమ, మానసిక దృఢత్వం, కఠోరశ్రమ' అన్నారు సౌమ్య కోచ్ రోషన్. ఆర్థిక వనరులు అంతగా లేకపోవడం వల్ల తన ప్రయాణంలో సౌమ్య కుమార్ ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంది. అయినా ఎప్పుడూ నిరాశపడలేదు. ఉత్సాహం అనే ఇంధనంతో అడుగులు వేసింది.

### అదే... తన తారకమంత్రం

'అయ్యో...పోలియోతో పుట్టింది' అని మోనా అగర్వాల్ గురించి ఎప్పుడూ ఎవరో ఒకరు బాధ పడుతుండేవారు. అలాంటి కాలంలో 'సంకల్ప బలం' అనే మంత్రోపదేశాన్ని చేసింది బామ్మ. అదే... మోనా అగర్వాల్ సక్సెస్ మంత్రా.

తాజాగా... ఆసియా పారా గేమ్స్‌లో మహిళల పది మీటర్ల ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్ 1 విభాగంలో స్వర్ణపతకం గెల్చుకుంది మోనా అగర్వాల్...

పోలియో బారిన పడిన మోనా క్రీడారంగంలో కెరీర్ నిర్మించుకోవడానికి 2010లో ఇంటిని వదిలింది. పారాలింపిక్స్ వంటి క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం తనకు కూడా ఉందనే విషయం ఆమెకు ఆలస్యంగా తెలిసింది. ఆ తరువాత...

### ఆమె మాటల్లోనే...

పోటీలలో పాల్గొనే అవకాశం ఉందనే విషయం తెలిసిన తరువాత, దేనిలో నేను అత్యుత్తమ ప్రతిభ కనబర్చగలనో తెలుసుకోవడానికి ప్రయత్నించాను. మూడు, నాలుగు ఆటలు ప్రయత్నించిన తరువాత షూటింగ్‌ను ఎంచుకున్నాను. నా స్నేహితుల దగ్గర అప్పు తీసుకొని పరికరాలు కొన్నాను. ఇది చాలా పెద్ద రిస్క్ అని తెలుసు. అయితే దాన్ని సద్వినియోగం చేసుకుంటే కుటుంబం గర్వపడేలా చేయవచ్చు. అప్పులు తీర్చవచ్చు అనుకున్నాను. ప్రాక్టీస్‌కు వెళ్లేముందు పిల్లలను ఇంట్లోనే వదిలి వెళ్లేదాన్ని. రోజూ వారికి వీడియో కాల్ చేసి మాట్లాడేదాన్ని. 'అమ్మా... నువ్వు ఇంటిదారి మరచిపోయావా? జీపిఎస్ ఆన్ చేసి ఇంటికి తిరిగి వచ్చేయ్ అనేవారు'. నా మనసు బాధతో తల్లడిల్లేది. పిల్లలతో మాట్లాడిన ప్రతి సాయంత్రం ఏడ్చేదాన్ని. నా ప్రయాణంలో ఆర్థిక కష్టాలు అడ్డుగా నిలిచాయి. అయినా వాటిని అధిగమించి ముందుకువెళ్లాను. పతకాలు సాధించాను.

## నీటి మట్టం తగ్గితే... భూమి కూడా డౌన్!

**భూగర్భ జలాలు పెరిగితే మళ్లీ పైకి లేస్తున్న వైనం**

**ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ఈ పరిస్థితి**

**మన దేశంలో ఏటా 10-17 సెం.మీ.**

**కుంగుతున్న ఢిల్లీలోని కపషేరా**

**కోల్‌కతాలో 8-12 మి.మీ.**

**మేర కుంగుతోందన్న అధ్యయనాలు**

**తెలంగాణకు ముప్పు తక్కువ..**

**హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో స్వల్ప ఆనవాళ్లు**



భూగర్భ జలాల మితిమీరిన వాడకం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రధాన నగరాలు క్రమంగా భూమిలోకి కుంగిపోతున్నాయి. దీన్నే ఆంగ్లంలో 'ల్యాండ్ సబ్సిడెన్స్'గా చెబుతున్నారు. అయితే, ఈ కుంగుబాటు శాశ్వతం కాదు. భూగర్భ జల మట్టాలను సమర్థవంతంగా పునరుద్ధరిస్తే భూమి తిరిగి పైకి లేస్తుందని, మళ్లీ పూర్వస్థితికి చేరే అవకాశం ఉందని సరికొత్త శాస్త్రీయ పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇండోనేసియా రాజధాని జకార్తా ఏటా 10 సెంటీమీటర్లకు పైగా కుంగిపోతుండటంతో ప్రస్తుతం రాజధానిని వేరే చోటకు తరలించాల్సిన స్థితి నెలకొంది. చైనాలోని టియాంజిన్ నగరంలోనూ భూమి కుంగుబాటు తీవ్రంగా ఉంది. అమెరికాలోని శాన్ డియాగో, ఇరాన్‌లోని ప్రధాన నగరాలు, న్యూజిలాండ్‌లోని దాదాపు 80% తీరప్రాంత పట్టణాలు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

### బెలూన్‌లో గాలి తగ్గినట్టు..పెరిగినట్టు!

నగరాల కింద భూమిలో ఉండే సహజ జలాశయాల (ఆక్విఫర్ల)ను నీటితో నిండిన ఒక భారీ బెలూన్‌తో పోల్చవచ్చు. ఒక పరిమితికి మించి భూగర్భ నీటిని బయటకు తోడేసినప్పుడు ఆ బెలూన్ ముడుచుకుపోయి, దానిపై ఆధారపడిన నేల కిందకు కుంగిపోతుంది. అయితే నీటి వినియోగాన్ని నియంత్రించి భూగర్భంలోకి జల వనరులను నింపటం ద్వారా భూమి కుంగిపోవటాన్ని అడ్డుకోవటమే కాకుండా, పూర్వస్థితికి తీసుకురావచ్చని జపాన్ అధ్యయనం స్పష్టం చేస్తోంది. భూమి పొరల్లో ఉండే పగుళ్లు లేదా చీలికలు (ఫాల్ట్స్) భూగర్భంలో నీటి ప్రవాహాన్ని అడ్డుకునే సహజ ఆనకట్టల వలె పనిచేస్తున్నట్లు గుర్తించారు. కుంగిన భూమిని వేగంగా పూర్వస్థితికి తేవటంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నట్లు కనుగొన్నారు.

### 2 మీటర్లు కుంగి, లేచిన 'ఒసాకా'

జపాన్‌లో తీవ్ర కుంగుబాటుకు గురైన ఒసాకా నగరం శాస్త్రవేత్తలకు ఒక సహజ ప్రయోగశాలగా మారింది. 1920--1960ల మధ్య అధికంగా నీటిని వాడటం వల్ల అక్కడ నీటిమట్టాలు 30 మీటర్లు తగ్గి, నేల 2 మీటర్ల కంటే ఎక్కువ కుంగిపోయింది. దీనితో ప్రభుత్వం 1960ల్లో భూగర్భ జలాల నియంత్రణపై కఠిన చట్టాలను అమలు చేసింది. పరిశోధకులు 1985 నుంచి ఒసాకాలోని 44 పర్యవేక్షణ బావుల డేటాను, భూఉపరితలంలో మార్పులను పరిశీలించారు. భూగర్భ నీటి నిల్వలు పుంజుకున్నప్పుడు నేల మళ్లీ సంవత్సరానికి సగటున 4 మిల్లీ మీటర్ల నుంచి గరిష్టంగా 12 మిల్లీ మీటర్లు పైకి లేచినట్లు పరిశోధకులు గుర్తించారు.

### మన నగరాల పరిస్థితేమిటి?

' మితిమీరిన భూగర్భ జలాల తోడివేత, వేగవంతమైన పట్టణీకరణ వల్ల మన దేశంలోనూ నేల కుంగుబాటు ప్రమాదం పెరుగుతోంది. ఇస్రో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ).. అత్యాధునిక ఉపగ్రహ రాడార్ సాంకేతికత ద్వారా తీరప్రాంతాలు, డెల్టాలు, మెగా ప్రాజెక్టుల స్థిరత్వాన్ని పర్యవేక్షిస్తుంటుంది.

' డెల్టా ప్రాంతాలు, భారీ నిర్మాణ కారిడార్లలో నిశ్శబ్దంగా జరిగే మైక్రో లెవల్ మార్పులను ఉపగ్రహ డేటా వెలికితీస్తుంది.

' ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్‌సెన్సింగ్ (ఐఐఆర్ఎస్), అంతర్జాతీయ ఉపగ్రహ అధ్యయనాల ప్రకారం.. ఢిల్లీలోని కపషేరాలో ఏటా 10--17 సెం.మీ., కోల్‌కతాలో 8--12 మి.మీ. మేర భూమి కుంగుతోందని వెల్లడైంది.

' కేంద్ర భూగర్భ జల మండలి (సీజీడబ్ల్యూబీ), ఇస్రో ఎన్ఆర్ఎస్సీ నివేదికల ప్రకారం.. దక్కన్ పీఠభూమిలోని రాతి పొరల వల్ల తెలంగాణకు కుంగుబాటు ముప్పు తక్కువగా ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో స్వల్ప కుంగుబాటు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తేలింది.

' ఏపీలోని కృష్ణా--గోదావరి డెల్టా, విశాఖ తీరాల్లో ఒండ్రు నేలలు ఉండటం, భూగర్భ జలాలు క్షీణించటం వల్ల నేల కుంగుతోంది. దీని వల్ల సముద్రపు ఉప్పునీరు భూగర్భంలోకి చొచ్చుకొచ్చే ప్రమాదమూ పెరుగుతోంది.

' వాన నీటి సంరక్షణ, భూగర్భ జలాల నిర్వహణపై ఉద్యమ స్ఫూర్తితో దృష్టి కేంద్రీకరించగలిగితే ఈ సమస్యలను అధిగమించవచ్చని అంతర్జాతీయ అనుభవాలు తెలియజెప్తున్నాయి.

## 'సుప్రీం' చెప్పినా బేఖాతరు!

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికల పర్వంలో వరసగా మూడురోజులపాటు సాగిన నామినేషన్ల ప్రహసనం గురించి బుధవారం సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలు దేశ చరిత్రలో కనీవినీ ఎరుగనివి. ఒకసారంటూ ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాకఅందులో జోక్యం చేసుకోబోమని న్యాయస్థానాలు చెప్పటమే ఇన్నాళ్లూ చూశాం. కానీఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు కనుసన్నల్లో పోలీసులూ, టీడీపీ గూండాలూ ఉమ్మడిగా స్వైరవిహారం చేసి సాగించిన దారుణ దమనకాండను గ్రహించాక ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఈ సంప్రదాయాన్ని పక్కనబెట్టక తప్పదని నిర్ణయానికొచ్చారు. నిరుడు పంజాబ్‌లో జరిగిన స్థానిక ఎన్నికల సందర్భంగా రెండు జిల్లాల్లోని వార్డుల్లో ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి రాగా ఇప్పుడు ఏకంగా ఏపీలోని 19 మున్సిపాలిటీల్లో నామినేషన్ల ప్రక్రియను నిలిపేయాలని, ఫిర్యాదులొచ్చిన ఇతరచోట్ల సైతం నామినేషన్ల గడువు పెంచుతూ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. చిత్రమేమంటే ఈ తీర్పు ప్రభావం కూటమి సర్కారుపై లేదా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ)పై ఏ మాత్రం లేదు. తీర్పు వెలువరిస్తున్న సమయానికీ, ఆ తర్వాతా కూడా వివిధ మున్సిపాలిటీల్లో టీడీపీ మూకల దౌర్జన్యకాండ కొనసాగుతూనే ఉంది. ఈ మూకల అరాచకాన్ని అధిగమించి ఇంతక్రితం నామినేషన్లు వేసినవారు బీ ఫాంలు అందజేయటానికొస్తే



వాటినిచించేయటం, నెత్తురోడేలా కొట్టడం, కార్లను ధ్వంసం చేయటం షరా మామూలుగా చోటుచేసుకున్నాయి. తాజాగా ప్రారంభమైన జడ్‌పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ఘట్టంలో సైతం టీడీపీ హింసాకాండతో రాష్ట్రం అట్టడుకుతోంది. గూండాయిజం, దౌర్జన్యం వెరపులేకుండా సాగుతోంది. అభ్యర్థితోపాటు ప్రతిపాదకులు మాత్రమే వెళ్తే గొడవలుండవని హితవు పలికిన పోలీసులు... కుట్రపూరితంగా అంతకుముందే టీడీపీ మూకల్ని కార్యాలయాల్లో కూర్చోబెట్టారు. దగ్గరుండి మరీ దాడులు చేయించారు. అధికారుల చేతుల్లోంచి సైతం నామినేషన్ పత్రాలు లాక్కొనటం, అభ్యర్థుల్ని నెత్తురోడేలా కొట్టడం, వారు అపస్మారకంలోకి పోవటం చానెళ్ల సాక్షిగా కనబడింది. చిత్తూరు మొదలుకొని వైఎస్సార్ కడప, అనంతపురం, రాజంపేట, ప్రకాశం, పల్నాడు, కాకినాడ తదితర జిల్లాల్లో అనేకచోట్ల గూండాల దౌర్జన్యం యధేచ్ఛగా సాగింది. శాంతియుతంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలపైనే పోలీసులు లాఠీచార్జి చేయటం, ఆడ పోలీసులు మహిళల దుస్తులు చించటంవంటి దుశ్శాసన పర్వం స్థానిక ఎన్నికల్లోనూ కనబడింది. నంద్యాల మున్సిపాలిటీలో ఏకంగా వైఎస్సార్ కాంగ్రెస్ వార్డు అభ్యర్థి సంతకాన్ని ఫోర్జరీ చేస్తే, దాన్ని అధికారులుఆమోదించి టీడీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా నెగ్గినట్టు ప్రకటించారు! లోకంలో దుర్మార్గుల స్వభావం గురించి భర్తృహరి నీతి శతకంలోని పద్యం 'కారణము లేని కలహంబు కరుణలేమి...' అంటూ వరసగా ఏకరువు పెడుతుంది. కారణం లేకుండా గొడవ పెట్టుకోవడంతోపాటు ఎవరిపైనా దయ, జాలి చూపకపోవడం, మంచివారిని చూసి ఓర్వలేకపోవడం, దుర్జనులతో సాన్నిహిత్యం వంటివిఅందులో ఉన్నాయి. కానీ ఆ పద్యం చెప్పని మరో లక్షణం చంద్రబాబులో ఉంది. దుర్మార్గులు అధికార పీఠాలెక్కి పరమ పవిత్ర సాధు పుంగవుల్లా సూక్తిముక్తావళి వల్లిస్తారని మాత్రం భర్తృహరి ఊహించలేక పోయాడు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు బాహాటంగా గజ్జెకట్టి ఆడుతున్న అనేక దుష్ట పోకడలకు చంద్రబాబు ఆద్యుడు. విద్యార్థిగా విశ్వవిద్యాలయంలో అనుసరించిన దుర్మార్గాలను సీఎంగా ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేసి చూపి, ఎన్నో రాష్ట్రాల్లో మాఫియా ముఠాలకు ఆదర్శంగా నిలిచిన జాతకం ఆయనది. బహుశా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ది ఆయన స్కూలే కావొచ్చు! తప్పనిసరై ఎన్నికలు జరపాల్సి వచ్చినప్పుడల్లా 'ఎలాగైనా' గెలిచి తీరాలన్న యావ తప్ప బాబులో మరొకటి కనబడదు. వృత్తి నిబద్ధతకు తూట్లు పొడవటం, వినయ విధేయస్వామ్యానికి వీరతాళ్లు వేయటం చంద్రబాబుప్రవృత్తి. అవసాన దశకు చేరుకున్న బాబులో ఈ దుర్లక్షణాలు మరింత ప్రకోపించిన వైనం కనబడుతోంది. కానీ ప్రజాస్వామ్యంలో ఏ రోగానికైనా తగిన 'చికిత్స' ఉంటుంది. బాబుతోపాటు ఆయన వీరవిధేయులు ఎస్ఈసీ పునేఠ, డీజీపీ గుప్తా కూడా దీన్నిగ్రహించటం ఉత్తమం.

# పెద్దపప్పూరులో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

### ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణపై అధికారులతో సమీక్ష
### అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలి
### భద్రతా సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి



అనంతపురం, అక్టోబర్ 22: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలు--2026లో భాగంగా పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీసు బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణలో భద్రతా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చివరి రోజు చివరి సమయంలో ఇబ్బందులు రాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, పెద్దపప్పూరు ఎంపీడీవో, డీఎం మార్క్‌ఫెడ్, ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



# జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం ఎంసీఎంసీ ఏర్పాటు

### జిల్లా పరిషత్‌లో మీడియా ధ్రువీకరణ, పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు
### రాజకీయ ప్రకటనలకు ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి
### పెయిడ్ న్యూస్‌పై కమిటీ పర్యవేక్షణ



అనంతపురం, అక్టోబర్ 22: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం మీడియా ధ్రువీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ తెలిపారు. టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ప్రదేశాల్లోని ఆడియో విజువల్ డిస్‌ప్లేలు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనల ధ్రువీకరణతో పాటు పెయిడ్ న్యూస్ పరిశీలన, పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ ఐఏఎస్ కమిటీ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ సీఈవో పి. విజయలక్ష్మి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఏ. బాలకొండయ్య సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

### జిల్లా పరిషత్‌లో ఎంసీఎంసీ ఏర్పాటు

అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్లానింగ్ సెక్షన్ ఎదురుగా ఉన్న గదిలో ఎంసీఎంసీని ఏర్పాటు చేశారు. గుర్తింపు పొందిన లేదా నమోదైన రాజకీయ పార్టీలు, వ్యక్తిగత అభ్యర్థులు రాజకీయ ప్రకటనల ధ్రువీకరణ కోసం ప్రకటనల ప్రసారం, ప్రదర్శన ప్రారంభమయ్యే తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా కమిటీకి దరఖాస్తు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తును అనెక్సర్--ఏ నమూనాలో సమర్పించాలి. ప్రతిపాదిత ప్రకటనకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రూపంలో రెండు కాపీలు, ధ్రువీకరించిన ప్రతిలేఖనం (ట్రాన్స్క్రిప్షన్), అవసరమైన ఇతర వివరాలను జతచేయాలి. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్‌ను జిల్లా స్థాయి ఎంసీఎంసీ పర్యవేక్షిస్తుందని తెలిపారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతం

### కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణం
### అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి
### ఎన్నికల ఖర్చు పరిమితులు తప్పనిసరిగా పాటించాలి



అనంతపురం, అక్టోబర్ 22: (మహి న్యూస్): అనంతపురం జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి. స్మరణ్ రాజ్ ఐఏఎస్, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సుబ్బరాజు ఐఎఫ్ఎస్ తెలిపారు. గురువారం అనంతపురం జిల్లా పరిషత్‌లో జరుగుతున్న జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



### ఎన్నికల ఖర్చు పరిమితులు

జడ్పీటీసీ అభ్యర్థి ఎన్నికల ప్రచారానికి గరిష్ఠంగా రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.4 లక్షలు మాత్రమే ఖర్చు చేయాలని పరిశీలకులు తెలిపారు. ఎన్నికల నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో విజయలక్ష్మి, సీపీఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఐక్యరాజ్య సమితిలో సుధామూర్తి

### సహకారానికి మాత్రమే అంతరిక్షం వేదిక కావాలి



యునైటెడ్ నేషన్స్: అంతరిక్షం ఆయుధ పోటీకి వేదిక కాకుండా నివారించేందుకు చట్టబద్ధమైన అంతర్జాతీయ ఏర్పాటు ఒకటి అవసరమని భారత్ స్పష్టం చేసింది. దేశాల పరస్పర సహకారానికి మాత్రమే అంతరిక్షం వేదిక కావాలని, ఘర్షణకు కాదని రాజ్యసభ సభ్యులు సుధామూర్తి తెలిపారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఫస్ట్ కమిటీ ముందు భారతదేశ వాణిని వినిపిస్తూ... "భారత అంతరిక్ష కార్యక్రమాలకు ఒకవైపున అభివృద్ధి.. రెండో వైపున భద్రతకు సంబంధించిన అంశాలున్నాయి" అని చెప్పారు. అంతరిక్షం అందరిదని భారత్ విశ్వసిస్తోందని, ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు అన్న భావన కలిగి ఉందని వివరించారు. అంతరిక్ష రంగంలో ఇప్పుడు కొంతమంది కొత్తవాళ్లు ప్రవేశించిన విషయాన్ని పరిగణలోకి తీసుకుంటూ.. రెండు రకాలుగానూ ఉపయోగించుకోగలిగే టెక్నాలజీలు, వ్యవస్థలు వాస్తవరూపం దాల్చాయని అన్నారు. భారత్ అంతరిక్షంలో ఆయుధాల పోటీని నివారించేందుకు చట్టపరంగా బలమైన ఒప్పందాన్ని కోరుతోంది అని స్పష్టం చేశారు. వివక్ష, 'స్వచ్ఛందంగా అమలు చేయాల్సిన నియమాలు' లేని, అందరిలోనూ విశ్వాసం కలిగించే ఏర్పాట్లు భారత్‌కు అంగీకార మైనప్పటికీ ఇవి తప్పనిసరిగా అమలు చేయాల్సిన (చట్టబద్ధమైన) ఏర్పాటుకు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు.

# అనంతపురంలో నేడు సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026 ప్రాంతీయ సదస్సు

### ప్రాంతీయ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
### ఏరోస్పేస్, ఆటోమోటివ్, సహజ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలపై చర్చలు
### పెట్టుబడుల భాగస్వామ్యాల కోసం ఎంవోయూలు, ఎంఎస్ఎంఈ స్టాళ్ల ఏర్పాటు

అనంతపురం, అక్టోబర్ 22: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీ ఈడీబీ) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్--2026 ప్రాంతీయ సదస్సు శుక్రవారం (అక్టోబర్ 23) అనంతపురం నగరంలోని జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ గురువారం పరిశీలించారు. సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఆడిటోరియంలో వేదిక, కుర్చీలు, భోజన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఏపీ పెవిలియన్‌లో నాలుగు జిల్లాలకు చెందిన ప్రముఖ ఉత్పత్తులను





ప్రదర్శించాలని, ఎంఎస్ఎంఈ స్టాళ్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్ణీత కార్యక్రమాల షెడ్యూల్ ప్రకారం సదస్సు నిర్వహించాలన్నారు. పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### ప్రధాన రంగాలపై చర్చలు

ఈ ప్రాంతీయ సదస్సులో ఏరోస్పేస్, రక్షణ రంగం, ఆటోమోటివ్, సహజ వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధన రంగాలపై ప్రధానంగా చర్చించనున్నారు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు, విధాన రూపకర్తలు పాల్గొననున్నారు. పెట్టుబడుల భాగస్వామ్యాలను అధికారికం చేసేందుకు ఎంవోయూలపై సంతకాలు చేయడంతో పాటు కీలక ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు.

### సదస్సు షెడ్యూల్

అక్టోబర్ 23న ఉదయం 10.30 గంటలకు ఏపీ పెవిలియన్, ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్, టెక్నాలజీ, ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభమవుతుంది. ఉదయం 11.15 గంటలకు ప్రారంభోత్సవం, స్వాగత ప్రసంగం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎంవోయూలపై సంతకాలు, మధ్యాహ్నం 1 గంటకు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఉంటాయి. మధ్యాహ్నం 1.30 గంటలకు భోజనం, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### రాష్ట్ర స్థాయి అధికారులు హాజరు

ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఏపీఐఐసీ ఎండీ దినేష్ కుమార్, ఏపీ ఈడీబీ సీఈవో సగిలి



షన్మోహన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభం బన్సల్, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వతో పాటు అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ తదితరులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, ఆర్డీవో ప్రేమంతకుమార్, ఐఅండ్‌పీఆర్ డీఐపీఆర్వో ఏ. బాలకొండయ్య, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీఎస్‌వో శోభారాణి, టౌన్ తహసీల్దార్ రాజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరుణవర్ణంలో విజయవాడ - 'జై భవానీ' నామస్మరణతో పులకిస్తున్న ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 22 : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల అనంతరం ఇంద్రకీలాద్రి పరిసరాలు, విజయవాడ వన్ టౌన్ ప్రాంతం అరుణవర్ణ శోభతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలో కీర్తించినట్లుగా, జగన్మాతకు అత్యంత ప్రీతిపాత్రమైన అరుణ వర్ణ (ఎరుపు రంగు) వస్త్రాలను ధరించి భవానీ దీక్షలతో తరలివచ్చిన భక్తజన ప్రవాహంతో క్షేత్రమంతా ఎరుపెక్కింది. గత రెండు రోజులుగా ఇసుకేస్తే రాలనంతగా పోటెత్తిన భవానీ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి 'జై భవానీ.. జై జై భవానీ' నామస్మరణతో మార్మోగిపోతోంది.

**ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం సాయంత్రం అధికారికంగా వివరాలు వెల్లడించారు.**

రికార్డు స్థాయిలో దర్శనాలు: దసరా ఉత్సవాల్లో అక్టోబర్ 11 నుండి 20వ తేదీ అర్ధరాత్రి వరకు దాదాపు 14,84,000 మంది (దాదాపు 15 లక్షల మంది) భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అనంతరం 21 మరియు 22 తేదీల్లో భవానీ భక్తులు నిరంతరాయంగా తరలివచ్చారు. దీంతో గురువారం సాయంత్రం 4 వరకు మొత్తం 18,29,000 మంది భక్తులు శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఈ రద్దీ అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశముంది. శుక్రవారం విరమణ చేయని భక్తులు మిగిలి ఉంటే శని, ఆదివారాల్లో దర్శనాలు పూర్తి చేసుకుంటారని అంచనా వేస్తున్నాము. లడ్డూ ప్రసాదం నిల్వలు: ఈరోజు సాయంత్రం 4 వరకు భక్తులకు ఇప్పటివరకు 39,84,000 లడ్డూ ప్రసాదాలను విజయవంతంగా అందించడం జరిగింది. భక్తుల కోసం ఆలయ



పోటు విభాగంలో ఇంకా 3,30,000 లడ్డూలు నికరంగా సిద్ధంగా అందుబాటులో ఉన్నాయి. అన్నప్రసాదం ‍ఢ ఆహార ప్యాకెట్ల వితరణ: ఇప్పటివరకు మొత్తం 8,37,385 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశాము. అన్నప్రసాద భవనంలో రాత్రి 12:00 గంటల వరకు భోజనాలు వడ్డిస్తుండగా, అర్ధరాత్రి 1:00 గంట నుండి వేకువజామున 4:00 - 5:00 గంటల వరకు హోల్డింగ్ ఏరియాల్లోని భక్తులకు ప్రత్యేకంగా ఫుడ్ ప్యాకెట్లు అందజేస్తున్నాము. అన్నప్రసాద భవనమే కాకుండా.. వినాయక గుడి ప్రారంభ పాయింట్, కేశఖండనశాల వద్ద గల అండర్‌పాస్, కొండపైన ప్రోటోకాల్ కార్యాలయం సమీపంలోని మూడు కేంద్రాల ద్వారా నిరంతరం ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాము. మజ్జిగ, బిస్కెట్లు ‍ఢ తాగునీరు: ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు 4,34,000 మందికి బటర్‌మిల్క్ (మజ్జిగ), 6,45,000 బిస్కెట్ ప్యాకెట్లను క్యూలైన్లలో అందజేశాము. క్యూలైన్లలోని భక్తులకు ఎప్పటికప్పుడు సురక్షిత తాగునీరు అందిస్తున్నాము. వైద్య సేవలు (ఓపీ): కొండపై ఏర్పాటు చేసిన 5 పడకల ఆసుపత్రి/వైద్య శిబిరాల్లో ఇప్పటివరకు సుమారు 1,06,000 మంది భక్తులకు ఉచిత ఓపీ వైద్య సేవలు, అత్యవసర మందులు అందించడం జరిగింది. ప్రధానంగా కాళ్ల నొప్పులు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో వచ్చిన వారికి ఉపశమనం కల్పించాము. సమన్వయం ‍ఢ మైక్ అనౌన్స్‌మెంట్లు: వినాయక గుడి, టోల్‌గేట్, ఓం టర్నింగ్, అమ్మవారి ప్రధానాలయం నుండి శివాలయం వరకు ప్రతి హోల్డింగ్ ఏరియాలో భక్తులకు మైకుల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, మహానివేదన, హారతుల వేళలను తెలియజేస్తున్నాము. అలాగే భక్తులలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు 'ఓం శ్రీ కనకదుర్గాయై నమః' నామస్మరణను మైకుల ద్వారా నిరంతరం వినిపిస్తున్నాము. దేవస్థాన ఉద్యోగులు, పోలీసు యంత్రాంగం, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేస్తూ, ఎంతటి రద్దీ ఉన్నప్పటికీ విచ్చేసిన భవానీ భక్తులందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా సంతృప్తికర దర్శనం, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈవో పేర్కొన్నారు.

# ఉన్నత విద్యారంగంలో పరిశోధనాత్మక మార్పుల కోసం ఆంధ్రప్రదేశ్ పిలుపు

గోవా, మహి న్యూస్, అక్టోబర్ 22 : విశ్వవిద్యాలయాలను కేవలం సాంప్రదాయ విద్యా కేంద్రాలుగా కాకుండా పరిశోధన, ఆవిష్కరణలు, వ్యవస్థాపకత మరియు సాంకేతిక పురోగతికి నిలయాలుగా మార్చాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ సైన్స్, టెక్నాలజీ ‍ఢ ఇన్నోవేషన్ శాఖ సెక్రటరీ డాక్టర్ హెచ్. పురుషోత్తం పిలుపునిచ్చారు. గోవా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో, గోవాలోని నొవొటెల్ గోవా డోనా సిల్వియా రిసార్ట్‌లో నిర్వహించిన "ఎకనామిక్ టైమ్స్ ఎడ్యుకేషన్ ఛాన్సలర్స్ కాంక్లేవ్ 2026" సదస్సులో ఆయన




పాల్గొని కీలక ఉపన్యాసం చేశారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సు గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ చేతులు మీదుగా ఘనంగా ప్రారంభించారు. "లీడర్‌షిప్ టు లెగసీ: రీడిఫైనింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్" (నాయకత్వం నుండి వారసత్వం : ఉన్నత విద్య భవిష్యత్తును పునర్నిర్వచించడం) అనే ఇతివృత్తంపై డాక్టర్ పురుషోత్తం ప్రసంగించారు. శాస్త్రీయ పరిశోధనలను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా మార్చడానికి మరియు డీప్-టెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య




బలమైన సహకారానికి విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉన్నత విద్యలో భాగం చేయాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా వివరించారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థులకు ఉపాధి కల్పించే నైపుణ్య ఆధారిత విద్యను అందించాలన్నారు. దేశ సాంకేతిక సామర్థ్యాలను, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి విశ్వవిద్యాలయాలలో బలమైన పరిశోధనా మౌలిక సదుపాయాలు, పేటెంట్ సృష్టి మరియు అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు అవసరమన్నారు. సాంప్రదాయ విద్యా విధానాల పరిధిని దాటి, అర్థవంతమైన పరిశోధనలు మరియు ఆవిష్కరణల ద్వారా సమాజంపై శాశ్వతమైన, సానుకూల ప్రభావాన్ని చూపాలని విద్యాసంస్థలకు డాక్టర్ పురుషోత్తం పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయాలు సాంప్రదాయ బోధనా పద్ధతులను దాటి ముందుకు సాగాలని, అర్థవంతమైన పరిశోధనలు, ఆవిష్కరణలు మరియు పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా సమాజంపై శాశ్వతమైన ప్రభావాన్ని చూపాలని ఆయన కోరారు. తద్వారా భారతదేశ సాంకేతిక సామర్థ్యాలను మరియు ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

# సీఈసీ అంశం: నవంబర్‌లో 'ఇండియా' కూటమి రెండో దశ నిరసనలు

న్యూఢిల్లీ: నవంబర్ మొదటి వారంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా రెండో విడత నిరసనలను ప్రారంభించాలని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి యోచిస్తోంది. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ ర్యాలీతో ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. దసరా, నవరాత్రి ఉత్సవాల కారణంగా తాత్కాలికంగా ఆగిన ఈ ఆందోళనలను మళ్లీ వేగవంతం చేసేందుకు విపక్ష నేతలు వరుస సమాలోచనలు జరుపుతున్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేవరకు తమ పోరాటం ఆగదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఢిల్లీ నడిబొడ్డున భారీ ప్రజా సమీకరణతో పాటు, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ప్రముఖ న్యాయకోవిదులతో ఒక 'మాక్ పార్లమెంట్' నిర్వహించి ఆయనపై అభిశంసన ప్రక్రియను ప్రదర్శించాలనే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నారు. భవిష్యత్ కార్యాచరణను పర్యవేక్షించేందుకు విపక్ష కూటమి త్వరలోనే ఒక ప్రత్యేక సమన్వయ కమిటీని ఏర్పాటు చేయనుంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ అక్టోబర్ రెండో వారంలో విపక్షాలు పెద్ద ఎత్తున ర్యాలీలు



నిర్వహించాయి. అక్టోబర్ 9న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సీఈసీ రాజీనామాతో పాటు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.3 కోట్ల మంది ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ 12న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించి, ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రామ్‌లీలా మైదానంలో నిర్వహించబోయే ర్యాలీలో విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థలను కూడా భాగస్వామ్యం చేయాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం అన్ని వర్గాలను ఏకం చేస్తూ ఈ పోరాటాన్ని దేశవ్యాప్తంగా ఉధృతం చేయాలన్నది ప్రతిపక్షాల ప్రధాన వ్యూహం. ఈ నిరసనల రూపురేఖలపై భాగస్వామ్య పక్షాలన్నీ కలిసి ఉమ్మడిగా అంతిమ నిర్ణయం తీసుకోనున్నాయి.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుంది

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష
## ఓటరు చీటీల పంపిణీపై అధికారుల వివరాలు
## డివిజన్ల విభజనతో ఓటు కేంద్రాల గుర్తింపులో ఇబ్బందులు



గుంటూరు, అక్టోబర్ 22: (మహి న్యూస్): గుంటూరు జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకుడు వీరబ్రహ్మయ్య, ఎన్నికల వ్యయ పరిశీలకురాలు నందిని సలారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేస్తే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటరు చీటీల పంపిణీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపారు. అయితే డివిజన్ల విభజన కారణంగా కొంతమంది ఓటర్లు తమ ఓటు ఎక్కడ ఉందో తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, టీడీపీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఎన్. ఓంకార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి. సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, సీపీఎం ప్రతినిధి బి. ముత్యాల రావు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వై. పిచ్చి రెడ్డి, జనసేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, బీజేపీ ప్రతినిధి వై.వి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





# పల్నాడు జిల్లాలో ప్రశాంతంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లు

## నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ కృతిక శుక్ల
## అభ్యర్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాం
## ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు



పల్నాడు, అక్టోబర్ 22: (మహి న్యూస్): పల్నాడు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. గురువారం అదనపు ఎస్పీ రోహిత్ చౌదరి, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్షతో కలిసి స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరుగుతున్న జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, రెండో రోజు కూడా ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ కృతిక శుక్ల తెలిపార్ను.






# ఆరో వార్డులో టీడీపీ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం ప్రారంభం

## చెన్నకేశవ కాలనీలో ప్రజలను కలుస్తూ
## ప్రచారం చేపట్టిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు







మాచర్ల అక్టోబర్ 21: (మహీ న్యూస్): మాచర్ల మండలం లో ఆరో వార్డు పరిధిలోని చెన్నకేశవ కాలనీలో టీడీపీ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలను వివరిస్తూ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ గా నిలబడుతున్న అన్నం దాసు మేరుతో పాటు మీ ఆలేటి వాసు మరియు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీలోని ప్రజలను కలుసుకుంటూ, టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాల గురించి వివరించారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ, వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేయడమే ఈ ప్రచార కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ప్రజల సహకారంతో ఆరో వార్డును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు.



# 'రాబోయే 30 ఏళ్ల వరకు..'.. రాహుల్‌పై అమిత్ షా విమర్శలు



న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాబోయే 30 సంవత్సరాల వరకు అధికారంలోకి వచ్చే అవకాశం మీకు రాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉన్నారని, అందుకే తన మాటలు ఆయనకు వినపడకపోవచ్చని పేర్కొన్న షా, ఆయన ఎందుకు విదేశాల్లో ఉన్నారనేది ఆయన వ్యక్తిగత విషయమని అన్నారు. అయితే రాహుల్ గాంధీ ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత తన మాటలను గుర్తుపెట్టుకోవాలని, భవిష్యత్తులో వారికి ఎలాంటి అవకాశం లభించదని ఎద్దేవా చేశారు. ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ)కి సంబంధించి సుమారు రూ.8,941 కోట్ల విలువైన 43 ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమంలో భాగంగా అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. కేవలం ధర్నాలు, ఆందోళనలు చేయడం వల్ల ఏమీ సాధించలేరని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని ఆయన హితవు పలికారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో పంజాబ్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడుతుందని, అక్కడి ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని కూడా ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఆయుష్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: డాక్టర్ ఆర్. శ్రీనివాస్

## కోట నెమలిపురి ఎస్సీ కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం




రాజుపాలెం అక్టోబర్ 21:(మహీ న్యూస్): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోట నెమలిపురి ఎస్సీ కాలనీలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణ, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.




ఆయుష్ శాఖ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ప్రాంతీయ ఉపసంచాలకులు డాక్టర్ ఎం. శేఖర్ రాజు ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు నీరసం, డీహైడ్రేషన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోజూ తగినంత నీరు తాగడంతో పాటు కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వివరించారు. అలాగే దినచర్య, ఋతుచర్య ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఆయుష్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన ఆయుష్ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. యోగా ఉపాధ్యాయులు నరసింహారావు, వెంకటరమణ పాల్గొని గ్రామస్తులకు యోగాసనాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు లాజర్, తిరుపతయ్య, ఏసుబాబు, అఖిల, జంగయ్య, మార్తమ్మ, పద్మమ్మ, లావణ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. పలువురు గ్రామస్తులు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# పల్నాడు సర్కిల్ విద్యుత్ అధికారులతో సీఎండీ పి. పుల్లారెడ్డి సమీక్ష

## నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలి
## వినియోగదారుల ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి
## విద్యుత్ ప్రమాదాలు, నష్టాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పల్నాడు, అక్టోబర్ 22: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) పరిధిలో విద్యుత్ సరఫరా, వినియోగదారులకు అందుతున్న సేవలు, విద్యుత్




అంతరాయాల నివారణ, నష్టాల నియంత్రణ, భద్రతా చర్యలపై సీఎండీ పి. పుల్లారెడ్డి పల్నాడు సర్కిల్ విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో మాచర్ల, నరసరావుపేట డివిజన్ల పరిధిలోని విద్యుత్ సరఫరా పరిస్థితి, సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ అంతరాయాలు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని సీఎండీ తెలిపారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు వాటిని త్వరగా గుర్తించి,




సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

### విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

పల్నాడు సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సీఎండీ సూచించారు. అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి లోడ్ బ్యాలెన్సింగ్, అదనపు సామర్థ్యం కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు.

### వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

1912 కాల్ సెంటర్, ఐవీఆర్ఎస్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా అందే విద్యుత్ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్ల దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించి, వినియోగదారులకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

### విద్యుత్ భద్రత, నష్టాల నియంత్రణ

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీఎండీ స్పష్టం చేశారు. ప్రజలు, విద్యుత్ సిబ్బంది భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. అధిక విద్యుత్ నష్టాలు




నమోదవుతున్న ఫీడర్లను గుర్తించి, వాటి కారణాలను విశ్లేషించి సాంకేతిక, పరిపాలనా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బిల్లింగ్, కలెక్షన్ పనితీరును మెరుగుపరచడంతో పాటు పెండింగ్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు.

### పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ప్రాధాన్యత

రూఫ్‌టాప్ సోలార్, పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎండీ తెలిపారు.

### క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలి

అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల పనితీరును పరిశీలించాలని పి. పుల్లారెడ్డి సూచించారు. మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్. వెంకటేశ్వర్లు, పల్నాడు సర్కిల్ సూపరింటెండెంట్ మస్తాన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఫోటో ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలి

## ఓటర్ల సందేహాల నివృత్తికి క్యూ ఆర్ కోడ్ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలి
## నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలి
## ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు



గుంటూరు, అక్టోబర్ 22: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఫోటో ఓటరు స్లిప్‌లను సిద్ధం చేసి, ఓటర్లకు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. మున్సిపాలిటీలలో డీలిమిటేషన్ కారణంగా కొంతమంది ఓటర్లు తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలుసుకోవడంలో సందిగ్ధంలో ఉన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించేందుకు క్యూ ఆర్ కోడ్ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు శుక్రవారం ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వచ్చే అవకాశం ఉన్నందున రిటర్నింగ్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌లను మరింత క్రియాశీలంగా నిర్వహించాలని, శిక్షణ పొందిన సిబ్బందిని వినియోగించాలని సూచించారు. నిబంధనల ప్రకారం 100 మీటర్ల పరిధిని పాటించాలని, నిర్ణీత సమయంలో వచ్చే అభ్యర్థులకు టోకెన్లు జారీ చేయాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ పూర్తయిన వెంటనే పరిశీలనకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రెండు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

### శుక్రవారం పీవోలు, ఏపీవోలకు శిక్షణ

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రిసైడింగ్ అధికారులు (పీవోలు), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవోలు) శుక్రవారం ప్రారంభమయ్యే తొలి శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణకు హాజరుకాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

### 24, 25 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలు

రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈ నెల 24, 25 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని తెనాలి మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఓటరు స్లిప్‌ల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించి, వంద శాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తెలిపారు. వ్యయ పరిశీలకులు నందిని సలారియా మాట్లాడుతూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల నమోదు కచ్చితంగా జరగాలని అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి. రమణమూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, ఇతర నోడల్ అధికారులు పాల్గొన్నారు."

# ఇన్‌స్టాలోకి సోనియా గాంధీ.. 'ఫస్ట్ లుక్' ఇదే..




న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కొత్తగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఖాతా తెరిచారు. తన తొలి పోస్టులో త్వరలో విడుదల కాబోయే ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఫస్ట్ లుక్‌ను పంచుకుంటూ, దీనిని 'ప్రేమ, బాధ్యత, కోల్పోవడం కలబోసిన కథ'గా అభివర్ణించారు. దేశంలోని యువతను, ముఖ్యంగా జెన్ జీకి చేరువయ్యేందుకు రాజకీయ నేతలుప్రయత్నిస్తున్న వేళ, సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ గురువారం ప్రముఖ ఫోటో షేరింగ్ ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్‌లోకి ప్రవేశించారు. సోషల్ మీడియా వేదికపై పెట్టిన తన మొదటి పోస్టులో, 79 ఏళ్ల రాజ్యసభ సభ్యురాలైన సోనియా గాంధీ తన పుస్తకం ప్రతిని అందుకుంటున్న వీడియో క్లిప్‌ను పంచుకుంటూ పాఠకులకు పరిచయం చేశారు. 'అందరికీ నమస్కారం, ఈ క్షణాన్ని మీ అందరితో పంచుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది; 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఫస్ట్ లుక్ ఇది. దీనిని మీతో పంచుకోవడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు. ఆమెకు మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీతో ఉన్న అనుబంధం, భారత రాజకీయాల్లో ఆమె సాగించిన ప్రయాణం వరకు అనేక అంశాలను స్పృశించే ఈ పుస్తకం చుట్టూ గతంలో తీవ్ర వివాదం చెలరేగింది. తొలుత ఈ పుస్తకాన్ని ప్రచురించాల్సిన పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా (పీఆర్‌హెచ్ఐ) పుస్తకంలో కొన్ని ఎడిటోరియల్ మార్పులు చేయాలని కోరింది. ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన భాగాలను తొలగించాలని సోనియా గాంధీని కోరినట్లు కొందరు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దీనిపై పీఆర్‌హెచ్ఐ స్పష్టత ఇచ్చింది. ఈ పుస్తకాన్ని ప్రచురించడానికి తాము ఎంతో ఆసక్తిగా ఉన్నామని, ఇది ఒక గొప్ప ఒప్పందమని పేర్కొంటూనే, ఒక నిర్దిష్ట అంశంపై ప్రతిష్టంభన ఏర్పడటంతో చివరకు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే తమపై ఎలాంటి బాహ్య ఒత్తిళ్లు లేవని ఖండిస్తూ, పుస్తకంలోని విషయాలు రహస్యమైనవని స్పష్టం చేసింది. ఒక ప్రచురణకర్తగా వాస్తవాలను తనిఖీ చేయడం (ఫ్యాక్ట్ చెక్), రచయితలకు తగిన సిఫార్సులు చేయడం తమ బాధ్యత, హక్కు అని పేర్కొంది. పుస్తకాన్ని ప్రచురించడానికి పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా సిద్ధంగా ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# చిత్తూరు జిల్లాలో ప్రశాంతంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లు

**నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి**



**అభ్యర్థులకు అన్ని సదుపాయాలు కల్పించాం**

**పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణ**

యాదమరి, అక్టోబర్ 22: (మహా న్యూస్): చిత్తూరు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ తుషార్ డూడితో కలిసి యాదమరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైందని, రెండో





రోజు కూడా ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ట్రైనీ కలెక్టర్ వెంకటేశ్, యాదమరి తహసీల్దార్ పార్థసారథి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పూతలపట్టు నియోజకవర్గంలో ఐదు మండలాలలో రెండో రోజు వేసిన ఎంపీటీసీ నామినేషన్లు...




చిత్తూరు జిల్లా/ పూతలపట్టు మహా న్యూస్ అక్టోబర్ 22.: పూతలపట్టు: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రెండో రోజు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు నమోదయ్యాయి. మండలాల వారీగా పార్టీలకు సంబంధించిన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. పూతలపట్టు మండలం: మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 6, వైఎస్సార్‌సీపీ 2, జనసేన 2, సీపీఎం 1 నామినేషన్ నమోదైంది. బంగారుపాళ్యం మండలం: మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 33, జనసేన 5 నామినేషన్లు నమోదయ్యాయి. ఐరాల మండలం: మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 6, జనసేన 3, వైఎస్సార్‌సీపీ 2 నామినేషన్లు నమోదయ్యాయి. యాదమరి మండలం: మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 7, జనసేన 4 నామినేషన్లు నమోదయ్యాయి. తవణంపల్లి మండలం: మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలకు గాను టీడీపీ 15, వైఎస్సార్‌సీపీ 2, జనసేన 2 నామినేషన్లు నమోదయ్యాయి.

# బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన

**నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు**

**బ్యాలెట్ బాక్సులు, భద్రతా ప్రమాణాల తనిఖీ**

**ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం**







తిరుపతి, అక్టోబర్ 22: (మహా న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండవ రోజు గురువారం తిరుపతి జిల్లాలోని బాలాయపల్లి, వెంకటగిరి మండల కార్యాలయాల్లో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్సులు, భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# "ఎన్నికల నిర్వహణలో విఫలం.. ఒక్కరోజే 76 చోట్ల దాడులు"



తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో చంద్రబాబు సర్కార్ పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీమంత్రి పేర్ని నాని ధ్వజమెత్తారు. తిరుమలలో తొమ్మిది మంది భక్తుల ప్రాణాలు తీసిన విఫల ప్రభుత్వం చంద్రబాబు ప్రభుత్వమని.. ఎన్నికల నిర్వహణపై సుప్రీంకోర్టు గడ్డి పెట్టినా ఈ నీచులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఈ రోజు (గురువారం) ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేర్నినాని మాట్లాడుతూ.. " స్థానిక సంస్థల ఎన్నికలు గొప్పగా నిర్వహిస్తామని సర్కార్ గొప్పలు చెప్పింది. నిర్వహించే సత్తా లేనప్పుడు రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడం ఎందుకు? ఎన్నికల సంఘం ఎంత జాగ్రత్తగా ఉండాలి. ఎవరు మేయరో, మున్సిపల్ ఛైర్మన్ ఎవరో మీరే ఎంపిక చేసుకోండి. ఎన్నికలు నిర్వహించడం ఎందుకు. నిర్వహణకు ఖర్చు పెట్టడం ఎందుకని ప్రశ్నించారు.స్థానిక సంస్థల ఎన్నికలు ఎంత దారుణంగా జరుగుతున్నాయో తెలపడానికి పుంగనూరు ఘటనే ఉదాహరణగా నిలిచిందన్న ఆయన పుంగనూరులో నామినేషన్లు వేయనియని పరిస్థితి ఏర్పడిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయడం లేదు. మీ దిక్కుమాలిన ప్రభుత్వం ఎవరికి ఆదర్శమని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.నిన్న ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 76 చోట్ల దాడులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు అసలు నామినేషన్ సెంటర్లలో టీడీపీ ఎమ్మెల్యేలలకు ఏం పనని? మరో రెండు రోజులు నామినేషన్లకు అవకాశాలు కల్పించాలని సుప్రీం చెప్పిందన్నారు. సుప్రీం కోర్టు గడ్డి పెట్టినా ఈ నీచులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందులలో నామినేషన్ వేసేందుకు వెళ్తే ఓ అధికారి ఇంటికి వెళ్లాలన్నారు. లా అండ్ ఆర్డర్ సరిగ్గా లేదంటూ నామినేషన్ వేయనివ్వలేదని పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

**పోలింగ్ ప్రక్రియను ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలించాలి**

**చెక్‌లిస్ట్‌ను పూర్తిస్థాయిలో నమోదు చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక ఇవ్వాలి**

**ఎన్నికల పారదర్శకత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**




చిత్తూరు, అక్టోబర్ 22: (మహా న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ సూచించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు




తావులేకుండా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి, వాస్తవాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. గురువారం చిత్తూరు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నియమితులైన సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, జిల్లా ఎస్వీఎస్ఈడబ్ల్యు అధికారి జి. రవికుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ఈ నెల 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ పరిశీలకులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని డీఆర్వో సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్సుల సిద్ధత, పోలింగ్ ఏజెంట్ల హాజరు, ప్రిసైడింగ్ అధికారి చేపట్టే తనిఖీలు, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమైందా లేదా అనే అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ సమయంలో అభ్యంతరాలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే వాస్తవాల ఆధారంగా నమోదు చేయాలని తెలిపారు. ఛాలెంజ్ ఓట్లు, టెండర్ ఓట్లకు సంబంధించిన వివరాలను కూడా చెక్‌లిస్ట్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

## చెక్‌లిస్ట్ నమోదు తప్పనిసరి

సూక్ష్మ పరిశీలకులకు అందించిన చెక్‌లిస్ట్‌లోని ప్రతి అంశాన్ని పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలు నమోదు చేయాలని డీఆర్వో ఆదేశించారు. గుర్తించిన లోపాలు, సమస్యలను స్పష్టంగా పేర్కొని, నివేదికను సాధారణ పరిశీలకులకు అందించే ముందు అన్ని వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ నిర్వహించే అధికారులు కాదని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరుగుతోందా లేదా పరిశీలించి నివేదిక సమర్పించడం వారి బాధ్యత అని స్పష్టం చేశారు.

## మూడు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు

జిల్లాలో తొలుత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, అనంతరం ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు డీఆర్వో తెలిపారు. గ్రామ పంచాయతీల సంఖ్య, అందుబాటులో ఉన్న సిబ్బంది, వనరులను దృష్టిలో ఉంచుకుని మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. అవసరాన్ని బట్టి తదుపరి దశల్లోనూ సూక్ష్మ పరిశీలకులకు విధులు కేటాయించే అవకాశం ఉందన్నారు.

## పటిష్ట భద్రతా ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ సున్నితమైన పోలింగ్ కేంద్రాల



వద్ద భద్రతను పటిష్ఠం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన చోట్ల సీసీటీవీ కెమెరాలు, వీడియో రికార్డింగ్ ఏర్పాట్లతో పాటు పోలింగ్ సిబ్బందికి శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. సూక్ష్మ పరిశీలకులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరుకుని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డీఆర్వో సూచించారు. ఎన్నికల పారదర్శకత, నిష్పక్షపాతత్వాన్ని కాపాడేందుకు ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి వాస్తవాలను మాత్రమే నివేదికలో పొందుపరచాలని తెలిపారు.

# ఫ్రాన్స్‌లో అల్లకల్లోలం.. భారతీయులకు కేంద్రం హెచ్చరిక!

అల్లర్లు.. విధ్వంసాలు.. కర్ఫ్యూలతో ఫ్రాన్స్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్రాన్స్‌లో మరోసారి నిరసనలు, సమ్మెలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు, పర్యటనకు వెళ్లినవారు అప్రమత్తంగా ఉండాలని భారత రాయబార కార్యాలయం హెచ్చరించింది. ఆందోళనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించింది. ఫ్రాన్స్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, పలు ప్రాంతాల్లో అమలవుతున్న స్థానిక కర్ఫ్యూల నేపథ్యంలో భారతీయులు జాగ్రత్తగా ఉండాలని పారిస్‌లోని భారత రాయబార కార్యాలయం తాజాగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఉద్రిక్తతలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, నిరసనలు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లొద్దని స్పష్టం చేసింది. ఫ్రాన్స్‌లోని పరిస్థితులపై స్థానిక వార్తలు, ప్రభుత్వ అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని భారతీయులకు సూచించింది. ఫ్రాన్స్ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తాజా సమాచారం తెలుసుకోవాలని తెలిపింది. పారిస్ ప్రాంతంలో ప్రజా రవాణా సేవలకు సంబంధించిన మార్పులు, అంతరాయాల కోసం ==ూ వెబ్‌సైట్‌ను తనిఖీ చేసుకోవాలని పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో పారిస్‌లోని భారత రాయబార కార్యాలయం లేదా మార్సెయ్‌లోని భారత కాన్సులేట్‌ను సంప్రదించాలని సూచించింది.




## పాఠశాలల సమస్యలతో మొదలై..

ఫ్రాన్స్‌లో పాఠశాలల్లో నిధుల కొరత, విద్యార్థుల రద్దీ వంటి సమస్యలపై సెప్టెంబర్ చివర్లో ప్రారంభమైన నిరసనలు క్రమంగా దేశవ్యాప్త ఆందోళనలుగా మారాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, ప్రభుత్వ ప్రజా సేవల్లో కోతలపై అసంతృప్తి కూడా ఉద్యమానికి తోడైంది. నిరసన సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో దోపిడీలు, నిప్పంటించే ఘటనలు, పోలీసులకు ఆందోళనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అక్టోబర్ 17న జరిగిన నిరసనల సందర్భంగా హింస చెలరేగడంతో పారిస్‌తో పాటు లిల్లే, లియోన్, నీస్ వంటి నగరాల్లోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూలు విధించారు. మార్సెయ్‌లోనూ సమావేశాలు, ప్రదర్శనలపై ఆంక్షలు అమలు చేశారు. వారాంతంలో జరిగిన అల్లర్లకు సంబంధించి 2,400 మందికి పైగా అరెస్టయ్యారని, దాదాపు వెయ్యి మంది పోలీసు అధికారులు గాయపడ్డారని మీడియా కథనాలు వెల్లడించాయి.

## శనివారం మరోసారి నిరసనలు..

## నవంబర్ 5న సమ్మె

ఫ్రాన్స్‌లో మరోసారి ఆందోళనలు జరిగే అవకాశాలు ఉండటంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. హింస పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ప్రకటించారు. ప్రధాన విద్యార్థి సంఘం, 2018--19లో ఇంధన ధరల పెంపుపై నిరసనలు చేపట్టిన ఎల్లో వెస్ట్ ఉద్యమానికి చెందినవారు శనివారం ర్యాలీలకు పిలుపునిచ్చారు. జీవన వ్యయం పెరుగుదల, ప్రజా సేవల్లో కోతలకు నిరసనగా నవంబర్ 5న సమ్మె చేపట్టనున్నట్లు కార్మిక సంఘాలు ప్రకటించాయి.

# ఫ్రాన్స్‌ని వణికిస్తున్న షమోండా వైరస్




బెర్లిన్: ఒకవైపు దేశంలో తీవ్రస్థాయికి చేరిన నిరసనలు, మరోవైపు ప్రాణాంతక వైరస్ రూపంలో ఊహించని పరిణామాలు ఫ్రాన్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పదికిపైగా యూరోపియన్ దేశాల్లో పశువుల ఫారాలను వణికించిన షమోండా వైరస్ తాజాగా ఓ వ్యక్తి ప్రాణాలను బలితీసుకుంది. ప్రపంచంలోనే మనుషుల్లో ఈ వైరస్ సోకి మరణం సంభవించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఫ్రాన్స్‌లో జీవన వ్యయం విపరీతంగా పెరిగిపోవడం, నిత్యావసరాల ధరలు చుక్కలనంటడం, పాఠశాలల్లో క్షీణిస్తున్న వసతులు, ప్రభుత్వ సేవలు సక్రమంగా అందకపోవడం వంటి సమస్యలపై విద్యార్థులు, కార్మిక సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డెక్కారు. 2018 నాటి ఎల్లో వెస్ట్ ఉద్యమం స్ఫూర్తితో చేపట్టిన ఈ ఆందోళనలు తారాస్థాయికి చేరుకోవడంతో దేశంలోని పలు ప్రాంతాలు యుద్ధ క్షేత్రాన్ని తలపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, నిత్యావసర సముదాయాలపై దాడులు జరగడంతో పాటు భారీగా ఆస్తినష్టం వాటిల్లింది.

## ప్రపంచంలోనే తొలి మానవ మరణం

ఈ అల్లర్లు, ఉద్రిక్తతల నడుమ ఆరోగ్య రంగంలో ఒక అసాధారణ ఘటన వెలుగు చూసింది. ఫ్రాన్స్‌లోని లియోన్ నగరానికి చెందిన హాస్పిసెస్ సివిల్స్ డి లియోన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి, ఈ నెల ప్రారంభంలో తీవ్రమైన అనారోగ్యం, రోగనిరోధక శక్తి లోపించడం వల్ల మరణించారు. అయితే ఆయన మరణానికి షమోండా వైరస్ కారణమని ఫ్రాన్స్ ఆరోగ్య శాఖ తాజాగా అధికారికంగా ధృవీకరించింది. మరణానికి ముందు బాధితుడిలో కనిపించిన మెదడు సంబంధిత సమస్యలు ఈ వైరస్ వల్లనే తలెత్తినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

## ఈసీడీసీ అప్రమత్తం

ఇప్పటివరకు షమోండా వైరస్ మనుషుల్లోకి వ్యాపించేది కాదని, కేవలం జంతువులకు మాత్రమే పరిమితమని శాస్త్రవేత్తలు భావించారు. అయితే, అనూహ్యంగా ఓ మనిషి ప్రాణాలు కోల్పోవడంతో యూరోపియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ (ఈసీడీసీ) అప్రమత్తమైంది. ఈ వైరస్ వ్యాప్తి తీరుపై ఫ్రెంచ్ అధికారులతో, అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి ఉన్నతస్థాయి సంప్రదింపులు జరుపుతోంది. మరోవైపు, ఈ ఘటనపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వైరస్ కాదని, సాధారణ జనాభాకు ఎలాంటి ముప్పు లేదని రాయటర్స్ తన కథనంలో స్పష్టం చేసింది.

## 1960లలో షమోండా వైరస్ వ్యాప్తి

దోమల జాతికి చెందిన రక్తాన్ని పీల్చే క్యులికోయిడ్స్ అనే చిన్న కీటకాలు కుట్టడం వల్ల ఈ వైరస్ పశువులకు, జీవులకు సోకుతుంది. ఈ వైరస్‌ను మొట్టమొదటగా 1960లలో నైజీరియాలో పశువుల నుంచి వేరు చేశారు. నాటి నుంచి ఇది ఆఫ్రికా దేశాలతో పాటు జపాన్‌లో అప్పుడప్పుడు పశువుల్లో కనిపిస్తూ వచ్చింది. ఈ వేసవిలో ఫ్రాన్స్‌లోని పశువుల ఫారాలతో పాటు ఐరోపా అంతటా ఈ వైరస్ కలకలం రేపింది. ఫ్రాన్స్‌లో చిన్న నెమరువేసే జంతువులు, గుర్రాలలో దీని ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయి. ఆస్ట్రియా, బెల్జియం, ఐర్లాండ్, ఇటలీ, లీచెన్‌స్టైన్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, పోర్చుగల్, స్లోవేనియా, స్పెయిన్, యూకేలోని జెర్సీ తదితర 10కి పైగా దేశాల్లో పశువులలో ఈ వైరస్ ఆనవాళ్లను గుర్తించారు. తాజాగా పశువుల నుంచి సోకే ఈ వైరస్ మనిషి ప్రాణాలు తీయడం వైద్య నిపుణులను సైతం విస్మయానికి గురిచేసింది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# నన్నూరులో వైసీపీకి భారీ షాక్

## వైసీపీని వీడి టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

## గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

## నూతనంగా చేరిన మహిళలు, యువకులకు టీడీపీ కండువాలు



కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పందిపాడు షరీఫ్, ఖుత్బుద్దీన్,



కట్టుబడి మహబూబ్ భాషతో పాటు 30 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో మాధవి నగర్ ఎమ్మెల్యే



క్యాంపు కార్యాలయంలో వీరంతా టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన మహిళలు, యువకులకు నాయకులు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో షాషా వలి, ఖాదర్ వలి, షేక్ రఫీ, షబ్బీర్ అహ్మద్, షకీర్ హుస్సేన్, ఉమర్ భాష, అబ్దుల్ సలాం, అబ్దుల్ వహీద్, గౌండా ఖాజా, మదర్ హుస్సేన్, మెకానిక్ బషీర్, గౌండ అబ్దుల్లా, గౌండ మా భాష తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు విశ్వేశ్వర రెడ్డి, ఖాజా మొహిద్దిన్, విజయుడు, శంషుద్దీన్, కటిక హాసన్, సర్కార్, చాంద్ బెగ్, సర్దార్ బెగ్, షెరు, మెకానిక్ చాంద్ బెగ్, కృష్ణ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు

శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 22 : లోకకల్యాణంకోసం దేవస్థానం అక్టోబర్ 22 న ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ, విష్ణు,మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరీతీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు.వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహ సరస్వతి స్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియపై కలెక్టర్ నిఘా

## లైవ్ స్ట్రీమింగ్ ద్వారా నామినేషన్ల పరిశీలన

## పారదర్శకత కోసం కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు

## ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవాలి



కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో జరుగుతున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి గురువారం లైవ్ స్ట్రీమింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లా పరిషత్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తీరును సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియపై నిరంతరం నిఘా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా జిల్లా పరిషత్, ఎంపీడీవో కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్, కంప్లైంట్ సెల్‌కు అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి, ఎప్పటికప్పుడు స్పందిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఫిర్యాదులపై సంబంధిత సిబ్బందిని ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని, ఎన్నికల నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# ఎంపీటీసీ నామినేషన్లపై పటిష్ట పర్యవేక్షణ చేపట్టాలి

## 100 మీటర్ల పరిధిలో నియంత్రణ చర్యలు, పోలీసు భద్రత ఏర్పాటు చేయాలి

## అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా హెల్ప్‌డెస్క్ ద్వారా సహాయం అందించాలి

## వీడియో కవరేజ్, ఆన్‌లైన్ నివేదికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



నంద్యాల, అక్టోబర్ 22: (మహి న్యూస్): ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల జిల్లా గోస్పాడు మండల కేంద్రంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి విధులు, నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలను సమీక్షించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో నిబంధనల ప్రకారం నియంత్రణ చర్యలు చేపట్టాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతను పటిష్టం చేయాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియను వీడియో కవరేజ్ ద్వారా నమోదు చేయాలని, ప్రతి దశలోనూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్ల దాఖలు, స్వీకరణకు సంబంధించి అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎవరికీ





ఇబ్బందులు కలగకుండా సహకారం అందించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై నిరంతరం నిఘా ఉంచాలని, ఉల్లంఘనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నామినేషన్లకు సంబంధించిన రోజువారీ వివరాలు, నివేదికలను నిర్దేశిత నమూనాలో ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు సమర్పించాలని సూచించారు. ఎన్నికల అధికారి, పోలీసు శాఖ, ఇతర సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నామినేషన్ల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

## పార్కింగ్, రిసెప్షన్, పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్ల పరిశీలన

## బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

## అధికారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి



కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ, బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు



ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ బి. అనిల్ కుమార్ రెడ్డి ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నగర శివార్లలోని అథెనా స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్లు, బ్యాలెట్ బాక్సుల భద్రత కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు గదులు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అధికారులు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలం కేటాయించి, ట్రాఫిక్‌కు



అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఓట్ల లెక్కింపు సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రమణమూర్తి, డీసీపీ శబ్నం శాస్త్రి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీఈఈలు నరేష్, శ్రీనివాసన్, పవన్ కుమార్ రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ ఫొటోతో డబ్బులు డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలి

## 9713588183 నంబర్ నుంచి వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



## గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు బదిలీ చేయవద్దు

## సైబర్ మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు

నంద్యాల, అక్టోబర్ 22: (మహి న్యూస్): నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రొఫైల్ ఫొటోను దుర్వినియోగం చేస్తూ డబ్బులు డిమాండ్ చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఫొటోతో 9713588183 నంబర్ నుంచి డబ్బులు కోరుతూ సందేశాలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఇలాంటి సందేశాలను నమ్మి ఎవరూ డబ్బులు బదిలీ చేయవద్దని కలెక్టర్ కోరారు. సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి, సందేశాలకు సంబంధించిన ఆధారాలతో పోలీసులకు లేదా సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. విచారణలో సైబర్ మోసం జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అప్రమత్తంగా ఉండండి.. సైబర్ మోసాలకు గురికాకండి.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

## సీసీటీవీ, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా

## నామినేషన్ కేంద్రాల వద్ద 100, 300 మీటర్ల పరిధిలో కటాఫ్ పాయింట్లు

## అభ్యర్థితో పాటు ఇద్దరికే కేంద్రంలోకి అనుమతి



కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. గురువారం కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని, అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణకు 26 కేంద్రాలు, జెడ్పీటీసీ నామినేషన్లకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఒక కేంద్రం కలిపి మొత్తం 27 కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరి రోజు కావడంతో అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద




సీసీటీవీ, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద 100 మీటర్లు, 300 మీటర్ల పరిధిలో కటాఫ్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉన్నందున ఎవరూ గుమిగూడకూడదని హెచ్చరించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు అభ్యర్థితో పాటు మరో ఇద్దరికి మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు తేజమూర్తి, శ్రీధర్‌తో పాటు పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

# దేవరగట్టు బన్ని ఉత్సవం ప్రశాంతంగా ముగింపు

## 1,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు

## భద్రతా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్





కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో బుధవారం రాత్రి ప్రారంభమైన బన్ని ఉత్సవం గురువారం ఉదయం ప్రశాంతంగా ముగిసింది. ఉత్సవంలో భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ దగ్గరుండి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించేందుకు 1,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టారు. గతంతో పోలిస్తే గాయాల సంఖ్య తగ్గించేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఏఎస్పీ జయ శర్మ ఐపీఎస్, అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాణ్యం లో వైసీపీకి ఎదురుదెబ్బ

## టీడీపీలో చేరిన వైసీపీ మాజీ ఉప సర్పంచ్

## పాలం చంద్రశేఖర్ రెడ్డి సహా పలువురు నాయకులు

## గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక



పాణ్యం, అక్టోబర్ 22: (మహి న్యూస్): పాణ్యం మండల కేంద్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు.



రామేశ్వర రెడ్డి, బాలరాజు, గడ్డం భాషా, సుగాలి మెట్టకు చెందిన వైసీపీ నాయకుడు వెంకట్ నాయక్ టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో వీరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరిన వారికి గౌరు దంపతులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగ రమేష్, మండల నాయకులు గోపాల్, వెంకటేశం అయ్యా, ఖాదర్, కమ్మ శ్రీనివాస రెడ్డి, తిరుపాల్ నాయక్, హనుమ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లెలో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు టీడీపీలో చేరిక

## వైసీపీని వీడి టీడీపీలో చేరిన రాజగోపాల్ రెడ్డి సహా పలువురు నాయకులు

## గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకట రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

పాణ్యం, అక్టోబర్ 22: (మహి న్యూస్): ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, పలు కుటుంబాలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. రాజగోపాల్ రెడ్డి, దేవరాజు, కురువ వెంకటేశ్వర్లు, రవి, చందు, భూషణ్ణ, అవుకు సుబ్బారాయుడు, రవీంద్ర



తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి, నందికొట్కూరు టీడీపీ నియోజకవర్గ



ఇన్‌ఛార్జి గౌరు వెంకట రెడ్డి సమక్షంలో మాధవి నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారికి గౌరు దంపతులు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్ చౌదరి, మాజీ డైరెక్టర్ రామ పుల్లారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# కలెక్టర్ పేరు, ఫొటోతో నకిలీ ఫోన్ కాల్స్.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## రూ.30 వేల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్న మోసగాళ్లు

## నకిలీ కాల్స్, వాట్సాప్ సందేశాలను నమ్మవద్దు

## డబ్బులు పంపే ముందు అధికారుల గుర్తింపును నిర్ధారించుకోవాలి




కర్నూలు, అక్టోబర్ 22: (మహి న్యూస్): కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేరు, ఫొటోను దుర్వినియోగం చేస్తూ కొంతమంది అపరిచిత వ్యక్తులు నకిలీ ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు, అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇటువంటి మోసపూరిత కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్ ఫోటోను ప్రొఫైల్ పిక్చర్‌గా ఉపయోగిస్తూ 8107487296 నంబర్ నుంచి పలువురికి ఫోన్ చేసి రూ.30 వేల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఈ ఫోన్ నంబర్ తనది కాదని స్పష్టం చేశారు. కలెక్టర్ పేరు, ఫోటోను ఉపయోగించి మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.




### నకిలీ కాల్స్‌ను నమ్మవద్దు.. డబ్బులు పంపవద్దు

కలెక్టర్ లేదా ఇతర ప్రభుత్వ అధికారుల పేరుతో అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని కలెక్టర్ సూచించారు. సంబంధిత వ్యక్తుల గుర్తింపును అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ధ్రువీకరించని వ్యక్తులకు డబ్బులు బదిలీ చేయవద్దని స్పష్టం చేశారు. ఇలాంటి మోసపూరిత కాల్స్ లేదా సందేశాలు అందినట్లయితే వాటికి సంబంధించిన ఫోన్ నంబర్లు, సందేశాలు, ఇతర ఆధారాలను భద్రపరచుకుని పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## వల్లూరు వద్ద ఆటోను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

### ఏ. ఒబాయపల్లి బస్టాండ్ సమీపంలో ప్రమాదం..





వల్లూరు మహి న్యూస్ అక్టోబర్ 22.: కడప - తాడిపత్రి జాతీయ రహదారిపై వల్లూరు మండల పరిధిలోని ఏ. ఒబాయపల్లి బస్టాండ్ సమీపంలో గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కడప నుంచి కమలాపురం వైపు వెళ్తున్న చిన్న ఆటోను, దాని వెనుక నుంచి వస్తున్న మహారాష్ట్రకు చెందిన పెద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వల్లూరు పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

## అండర్ ట్రయిల్ రివ్యూ కమిటీ సభ్యులు తో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్"





కడప మహి న్యూస్ అక్టోబర్ 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జి.రామ గోపాల్, అధ్యక్షులు కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వారి సూచనల మేరకు గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు తన ఛాంబర్ న్యాయ సేవా సదన్ కడప నందు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సభ్యులు తో రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెయిల్స్, అప్పీళ్లు, ష్యూరిటీలు, నగదు సర్యూటీలు, సాధికార కమిటీ, చట్టపరమైన సహాయం డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్స్, మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ఆర్. డి.ఓ. లు, డిసిఆర్బీ లు, పురుషుల, ప్రతేక మహిళ కారాగారం సూపరింటెండెంట్లు మరియు సబ్ జైల్ సూపరింటెంట్ పాల్గొన్నారు.

## జమ్మలమడుగులో టీడీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

### 14, 16, 17, 18 వార్డుల్లో ఇంటింటి ప్రచారం



కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 22, (మహి న్యూస్): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 14, 16, 17, 18 వార్డుల్లో జమ్మలమడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని తమ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు రామసుబ్బమ్మ, సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, భూపేష్ రెడ్డి సోదరి ప్రశాంతి, రాష్ట్ర కార్యదర్శి గురప్పతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ..!



కడప, మహి న్యూస్ అక్టోబరు 22: జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రెండవ రోజు జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ తీరును, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అభ్యర్థులు ఎక్కువసేపు వేచి ఉండకుండా నామినేషన్ పత్రాలను త్వరితగతిన పరిశీలించి, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణతో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలను సజావుగా, పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు, ఓటర్లు నిర్భయంగా తమ ఎన్నికల హక్కులను సద్వినియోగం చేసుకునేలా ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కడప ఆర్డీవో మురళి, కడప డిఎస్పీ భవానీ పాల్గొన్నారు.

## జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన

### - జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ...



మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 22: అన్నమయ్య జిల్లాలో జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రెండవ రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె రోడ్డులో, వశిష్ట పాఠశాల సమీపంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మదనపల్లె, రాయచోటి, పీలేరు డివిజన్లకు ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి, రిటర్నింగ్ అధికారులు , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు , హెల్ప్‌డెస్క్ సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు ఎక్కువసేపు వేచి ఉండకుండా అధికారులు పత్రాలను త్వరితగతిన పరిశీలించి, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులను ప్రధాన గేటు వద్దకు అనుమతించి, నిబంధనల ప్రకారం వారి నామినేషన్ల స్వీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అలసత్వం వహించకుండా ఎన్నికల నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, నామినేషన్ల స్వీకరణను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులతో ఎంతసేపటి నుండి వేచి ఉన్నారని, కేంద్రంలోని ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. రిటర్నింగ్ అధికారి,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికత పాటిస్తూ పనిచేయాలని అన్నారు. ఈ పరిశీలనలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జడ్పీ సీఈఓ లక్ష్మీపతి, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాయచోటి జెడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా గండికోట లక్ష్మీ ప్రసన్న నామినేషన్



మదనపల్లె, మహిన్యూస్ అక్టోబర్ 22: అన్నమయ్య జిల్లా రాయచోటి జెడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గండికోట లక్ష్మీ ప్రసన్న గురువారం నామినేషన్ దాఖలు చేశారు. మదనపల్లెలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో ఆమె ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. రాయచోటి టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట సుధాకర్ సతీమణి అయిన లక్ష్మీ ప్రసన్నకు పార్టీ అధిష్ఠానం జెడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, మౌరియా రెడ్డి ఆశీస్సులతో ఆమె నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకం ఉంచి అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల లక్ష్మీ ప్రసన్న కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ముందుకు సాగుతూ ప్రజలకు సేవ చేయడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించడం పార్టీ ప్రత్యేకత అని టీడీపీ వర్గాలు అభిప్రాయపడ్డాయి. గండికోట లక్ష్మీ ప్రసన్న నామినేషన్ దాఖలు చేయడంతో రాయచోటి జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## దీపావళి పండుగ సంతోషకరంగా జరగాలి..!

### బాణసంచా భద్రత నిర్వహణపై

### జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో డిఆర్వో మల్లికార్జునుడు

కడప, మహి న్యూస్ అక్టోబర్ 22 : ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా.. అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా ఆహ్లాదకరంగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని డిఆర్వో మల్లికార్జునుడు అధికారులను ఆదేశించారు. రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని బాణసంచా స్టాళ్లకు అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు.. తదితర అంశాలపై.. గురువారం సాయంత్రం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్వో మల్లికార్జునుడు అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఆన్ లైన్ విధానం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి బాణసంచా స్టాళ్ల నిర్వహణకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధ్వని, వాయు కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేస్తూ.. ప్రభుత్వ నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రత చర్యలను తప్పక పాటిస్తూ.. సంప్రదాయ పండుగను సంతోషంగా నిర్వహించుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే టపాసులు కొనుగోలు చేసేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లో.. బాణసంచా విక్రయ కేంద్రాలకు పరిమిత సంఖ్యలో అనుమతులు ఇవ్వాలని సంబందిత అధికారులకు సూచించారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే.. విక్రయదారులపై కేసులు నమోదు చేయాలని సంబందిత మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. ఆర్డీఓలు.. అన్ని బాణసంచా నిల్వ గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి.. అనుమతులు ఉన్నవాటికి పర్మిషన్లు, పర్మిషన్ ముగిసిన స్టాళ్లకు రెన్యూవల్ చేయించే చర్యలు చేపట్టాలన్నారు. అందుకు సంబంధించి విధివిధానాలను ఇప్పటికే సంబందిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో.. ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, కడప నగర కమీషనర్ తోపాటు.. అన్ని మున్సిపాలిటీల కమీషనర్లు, అన్ని మండలాల తహసిల్దార్లు, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణకు గైర్హాజరైన పీవోలు, ఏపీవోలపై చర్యలు..!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ అక్టోబరు 22: స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధులకు సంబంధించి గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి గైర్హాజరైన పోలింగ్ అధికారులు (పీవోలు), సహాయ పోలింగ్ అధికారులు (ఏపీవోలు)పై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు శిక్షణా కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని, ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

## సీజేపీ కీలక నేతలకు మరో షాక్




ఢిల్లీ: జంతర్ మంతర్ వద్ద నిరసనకు సంబంధించిన కేసులో కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ సమన్లు జారీ చేసింది. అక్టోబర్ 22 గురువారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. మరో నేత అజింక్య షిండేను కూడా విచారణకు పిలిచింది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు రాజౌరీ గార్డెన్‌లోని క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో హాజరుకావాలని నేతలను పోలీసులు ఆదేశించారు. వారం రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండి బుధవారం తీహార్ జైలు నుంచి విడుదలైన మరుసటి రోజే ఈ సమన్లు జారీ కావడం గమనార్హం. జంతర్ మంతర్ వద్ద నిరసనకు సంబంధించి సీజేపీ నేతలపై నమోదైన రెండు కేసులను ఈ వారంలో ఢిల్లీ పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆ సమయంలో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అక్టోబర్ 13న సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా, అజింక్య షిండేతో పాటు సీజేపీకి చెందిన మరో 11 మంది జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. అయితే, జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో వారు ప్రైవేటు స్థలంలోకి చొరబడి అక్కడి నుంచి నిరసన ప్రదేశానికి చేరుకున్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి కేసులు నమోదు చేశారు.

## పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం నారాయణఖేడ్

### - సబ్ కలెక్టర్ ఉమా హారతి

సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి : 2026 అక్టోబర్ 22 గురువారం అణగారిన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఇన్‌చార్జి డీఆర్‌డీఓ ఉమా హారతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆనాటి భూస్వాములు దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలవరం జడ్పీటీసీ అభ్యర్థినిగా సుంకర నాగమణి నామినేషన్

పోలవరం, అక్టోబర్ 22 పోలవరం మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థినిగా సుంకర నాగమణి నామినేషన్ దాఖలు చేశారు.జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థినిగా ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెల్లం రాజ్యలక్ష్మి ,జల్లేపల్లి పెద్దబ్బులు కూడా హాజరయ్యారు.నామినేషన్ దాఖలుతో పోలవరం మండలంలో రాజకీయ సందడి నెలకొంది.జడ్పీటీసీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సుంకర నాగమణి సిద్ధమయ్యారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా పార్టీ నాయకులు ఆమెకు మద్దతుగా నిలిచారు.

# 'ఎస్ఈసీపై సుప్రీంకోర్టుకు వెళతాం'



గుంటూరు: చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ గూండాలు బరితెగించి నామినేషన్లు వేసేందుకు వెళ్తున్న వైఎస్సార్సీపీ అభ్యర్థులపై దాడులు చేస్తుంటే, ఇళ్లలోకి దూరి మరీ అభ్యర్థుల్ని లాక్కొచ్చి నామినేషన్లు విత్ డ్రా చేయిస్తుంటే ఎస్ఈసీ ఏం చేస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత విడదల రజిని తీవ్రంగా మండిపడ్డారు. చిలకలూరిపేటలో టీడీపీ దాడులకు దిగుతుంటే, బెదిరించి నామినేషన్లు విత్ డ్రా చేయిస్తుంటే పోలీసులు కూడా చోద్యం చూస్తున్నారని ఆక్షేపించారు. అర్ధరాత్రి 12 గంటల వరకూ మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు విత్ డ్రా చేయించిన వ్యవహారంపై ఎస్ఈసీని కలిసి ఆధారాలు సమర్పించామని, దీనిపై తగు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టు వరకైనా వెళ్లి న్యాయం కోరతామని విడదల రజిని హెచ్చరించారు. ప్రెస్ మీట్లో విడదల రజినీ ఇంకా ఏమన్నారంటే... రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ఏ విధంగా స్థానిక ఎన్నికల్లో దాడులు, అక్రమాలకు పాల్పడుతున్నారో అందరూ చూస్తున్నారు. ఈ రెడ్ బుక్ ఎలెక్షన్ అజెండా ఒక్కటే. కూటమి అభ్యర్థులు పోటీ కూడా పడకుండానే, వాళ్లే సుప్రీం అనుకుని, వాళ్లకే ఏకగ్రీవం కావాలని, వాళ్లే గెలిచినట్లు డిక్లరేషన్ చేసుకోవడమే ఈ రెడ్ బుక్ ఎలెక్షన్. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా విపక్ష అభ్యర్థులు నామినేషన్లను అడ్డుకోవడం, వాళ్ల కుటుంబ సభ్యుల్ని, పిల్లల్ని వేధిస్తున్నారు. ఇన్ని ఇబ్బందులు పెడుతున్నా, దాడులు చేస్తున్నా ఎక్కడా వెనక్కి తగ్గకుండా మా నాయకుడు వైఎస్ జగన్‌పై ఉన్న అభిమానంతో పోటీ చేయాలని ముందుకొస్తున్న వారిని ఎంత మెచ్చుకున్నా తక్కువే అవుతుంది. అందుకే వారికి కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నాం. ఎంపీటీసీ,జడ్పీటీసీ నామినేషన్లు ప్రారంభమయ్యాక కూడా అధికారులు వైఎస్సార్సీపీ అభ్యర్థులకు ఎక్కడా ఎన్వోసీలు ఇవ్వకుండా సాకులు చెప్తూ వచ్చారు.చివరికి ఎస్ఈసీ ఆదేశాలు ఇచ్చిన తర్వాత వెనక్కి తగ్గారు. ఎన్వోసీల అడ్డంకులు తప్పాయి నామినేషన్ వేద్దామని అనుకుంటే, మండల కేంద్రాల్లో నామినేషన్ కేంద్రాలకు దగ్గరగా బ్యారికేడ్లు పెట్టి, అక్కడ 400-500 మంది టీడీపీ వాళ్లు, పోలీసులు ఉంటారు. పోలీసులు ఉన్నారు కదా సవ్యంగా నామినేషన్లు వేసుకునేలా చూస్తారా అంటే అదీ లేదు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వైఎస్సార్సీపీ అభ్యర్థులపై దౌర్జన్యాలు చేయడానికి, వాళ్ల తలలు పగులగొట్టడానికి, చంపడానికి ప్రయత్నిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఇవాళ నా నియోజకవర్గంలోని నాదెండ్ల మండలంలో నామినేషన్ వేయానుకున్న అభ్యర్థులనూ, నాయకులనూ కారణం చెప్పకుండానే పోలీసు స్టేషన్ కు తీసుకెళ్లి బంధించారు. ఎడ్లపాడులో మా నాయకులు నామినేషన్లు వేయాలని బయటికి వస్తే వాళ్లను టీడీపీ వాళ్లు అడ్డుకుని, గూండాయిజం, రౌడీయిజం చేస్తూ పోలీసుల సమక్షంలోనే అడ్డుకున్నారు. సినిమా ఫక్కీలో ఇరువర్గాల వారిని లాఠీచార్జ్ చేసి చెదరగొట్టామని చెప్పుకుంటూ పోలీసులు డ్రామాలు ఆడుతున్నారు.

### అర్ధరాత్రి 12 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణా ?

పోలీసులు ఎక్కడ కూడా అభ్యర్థులతో స్వేచ్ఛగా నామినేషన్లు వేయించాలని, గొడవలు నివారిద్దామని అనుకోవడం లేదు. అంటే అధికార పార్టీ రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా టీడీపీ వాళ్లు గూండాలు, రౌడీల మాదిరిగా నామినేషన్లు వేయాలనుకున్న వైఎస్సార్సీపీ వాళ్ల మీద దాడులు చేస్తున్నారు. అందుకే ఎడ్లపాడులో మహిళలు హైవే ఎక్కి నామినేషన్ వేసేందుకు అనుమతించాలని పోలీసుల ముందు నిరసనకు దిగాల్సిన పరిస్థితిని అందరూ చూశారు. ఈ విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లను వీళ్లు అడ్డుకుంటుంటే ఎస్ఈసీ ఏం చేస్తుంది, ప్రభుత్వం ఏం చేస్తుందని అడుగుతున్నాం. ఈసీ రూల్స్ ఎవరూ పాటించడం లేదు. 2019లో వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక నిర్వహించిన స్థానిక ఎన్నికల్ని ఎంతో పద్ధతిగా నిర్వహించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. నిన్న రాష్ట్రవ్యాప్తంగా 3 గంటలకు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల విత్ డ్రా ప్రక్రియ ముగిసింది. కానీ మా చిలకలూరిపేట నియోజకవర్గంలో మాత్రం 3 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ విత్ డ్రా ప్రక్రియ కొనసాగింది. ఇందుకు ఇక్కడ ఉన్న మీడియా మిత్రులే సాక్ష్యం. ఏంటీ అన్యాయమని ప్రతీ ఒక్కరూ మాట్లాడుతున్నారు. ఈ రాష్ట్రంలో చంద్రబాబుకు, ఈ ప్రభుత్వానికి దమ్ముంటే నిజాయితీగా ఎన్నికలు జరిపిస్తే చిలకలూరిపేటలో మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఏం జరిగిందో సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టండి. ఎస్ఈసీ ఇందులో జోక్యం చేసుకోవాలని ఇవాళ ఫిర్యాదు చేశాను. ఎన్నికలు వాయిదా వేస్తున్నామని ఎస్ఈసీ రాత్రి 10 గంటలకు ప్రకటించినా అది కూడా లెక్కచేయకుండా రాత్రి 12 గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం కొనసాగించారు. చంపుతామని బెదిరించి, కొట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, ఉద్యోగాలు, ఆస్తుల విషయంలో అంతు తేలుస్తామని బెదిరించి, కిడ్నాప్ లు చేసి నామినేషన్లను ఉపసంహరించుకునేలా చేశారు. నైట్ డ్రెస్ లో ఉన్న మహిళను సైతం డ్రెస్ మార్చుకుని వస్తామని చెప్పినా టీడీపీ గూండాలు ఎత్తుకొచ్చి రాత్రి 11 గంటలకు ఆమెతో నామినేషన్ ఉపసంహరింపజేశారు. రాత్రి 12 గంటల వరకూ అధికారులు ఎందుకు పనిచేశారో చెప్పాలి.

### ఎస్ఈసీ చర్యలు తీసుకోకపోతే న్యాయపోరాటం తప్పదు

టీడీపీకి ధైర్యం, నిజాయితీ ఉంటే ఇలాంటి తప్పులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. ధైర్యముంటే ప్రజల్లోకి రండి, మీరేం చెప్పాలనుకుంటున్నారో చెప్పండి, మేమేం చెప్పాలో చెప్తాం, వాళ్లే అన్నీ నిర్ణయిస్తారు. అలా కాకుండా నీచమైన, దుర్మార్గమైన పనులకు దిగుతున్నారంటే చిలకలూరిపేటలో ఓడిపోతామన్న భయం మీలో కనిపించింది. మహిళలని కూడా లెక్కచేయకుండా ఇలాంటి దాడులకు దిగుతున్నారంటే రెడ్ బుక్ ఎన్నికల అజెండా ఎలా ఉందో అర్థమవుతోంది. ఒకరిని మించి మరొకరు ఇందులో పోటీ పడుతున్నారు. ఒకరు నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకుంటే, మరొకరు ప్రత్యర్థుల్ని ఇంటిలో నుంచి బయటికి రాకుండా అడ్డుకుని పోటీ పడుతున్నారు. ఇలా ఒకరిని మించి మరొకరు ఎన్నికల్లో ఇన్ని విధాలుగా ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారో అర్థమవుతోంది. ఇదంతా కరెక్టేనా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. దీనిపై ఇవాళ చిలకలూరిపేట నియోజకవర్గంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జరిగిన దారుణాలు, దాడులు, బెదిరింపులపై ఎస్ఈసీకి ఫిర్యాదు చేశాను. 12 గంటల వరకూ ఎలా నామినేషన్లు విత్ డ్రా చేయించారో కూడా ఆధారాలు, వీడియోలను సమర్పించి తగిన చర్యలు తీసుకోవాలని కోరాను. అలాగే నిన్న మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ సీసీటీవీ ఫుటేజ్ ను ఫ్రీజ్ చేయమని కూడా కోరాను. దీనికి సంబంధించి మా దగ్గర ఉన్న ఆధారాలన్నీ సమర్పించాం. ఇవన్నీ అధ్యయనం చేసి వెంటనే ఈ ఎన్నికల్ని రీషెడ్యూల్ చేయమని కోరాం. ఎస్ఈసీ మాకు కచ్చితంగా న్యాయం చేయకపోతే వెంటనే హైకోర్టును ఆశ్రయిస్తాం, సుప్రీంకోర్టు వరకూ వెళ్తాం, ఎన్నికల్లో ఎవరైతే అత్యుత్సాహం చూపించారో వారిని శిక్షించే వరకూ వదిలిపెట్టం. వైఎస్సార్సీపీని ఎంత అణగదొక్కినా, ప్రజలు సరైన సమయం చూసి మీకు తీర్పు ఇస్తారని ఆశిస్తున్నాం. టెక్నికల్‌గా వీళ్లు గెలిచినా, నైతికంగా వైఎస్సార్సీపీయే గెలువబోతోందని విడదల రజిని తేల్చిచెప్పారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com